


# అనంత జనశక్తి


జనం కోసమే మా అక్షరం

30.08.2026
ఆదివారం |రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 51
పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగొద్దు

- సీఎం రేవంత్‌రెడ్డి కామెంట్లు
- ఏఎస్‌డీడీలో 73.39 లక్షల ఎంట్రీలు
- 45.19 లక్షల మంది షిఫ్టెడ్‌గా గుర్తింపు
- మూడు జిల్లాల్లో 58.6% ఎంట్రీలు
- తాత్కాలిక గైర్హాజరును వలసగా చూడొద్దు
- అభ్యంతరాల గడువు పెంచాలి
- ఓటర్లకు అదనపు సమయం ఇవ్వాలి
- డ్రాఫ్ట్ జాబితా బహిరంగంగా చదవాలి
- అదనపు అధికారులను నియమించాలి





**హైదరాబాద్, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు ఏఎస్‌డీడీ జాబితాలోకి వెళ్లడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసిన ఆయన.. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా తుది జాబితాలో చోటు కోల్పోకుండా ప్రక్రియను పారదర్శకంగా, అందరికీ అవకాశం కల్పించేలా నిర్వహించాలని సూచించారు. సర్‌లో తెలంగాణకు చెందిన 73.39 లక్షల ఓటర్ల ఎంట్రీలు ఏఎస్‌డీడీ జాబితా లోకివెళ్లాయని సీఎం పేర్కొన్నారు. వీరిలో 45.19 లక్షల మందిని శాశ్వతంగా తరలిపోయినవారుగా గుర్తించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం ఏఎస్ డీడీ ఎంట్రీల్లో దాదాపు 58.6 శాతం హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే ఉన్నాయని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా జారీ చేసిన వెరిఫికేషన్ నోటీసుల్లోనూ 41.9 శాతం ఈ మూడు జిల్లాల్లోనే ఉన్నాయని తెలిపారు.

తాత్కాలికంగా ఇంట్లో లేని ఓటర్లను శాశ్వతంగా తరలిపోయినవారిగా పరిగణించకూడదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉద్యోగం, విద్య, ఇతర కారణాలతో తాత్కాలికంగా మరో ప్రాంతంలో ఉన్నవారికి తగిన అవకాశం కల్పించాలని కోరారు. ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారికి కొత్త చిరునామాలో ఓటు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించాలని సూచించారు. షిఫ్టెడ్ కేటగిరీలో ఉన్న ఓటర్లకు కూడా తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఆగస్టు 17 నుంచి సెప్టెంబరు 16 వరకు ఉన్న క్లెయిమ్స్, అభ్యంతరాల గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలని సీఎం కోరారు. సెప్టెంబరు 19న తుది జాబితా ప్రచురణకు బదులుగా అదనపు సమయం ఇవ్వాలని ప్రతిపాదించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు స్పందించేందుకు కనీసం 3-4 వారాల వ్యవధి ఉండాలని పేర్కొన్నారు.

గ్రామసభలు, వార్డు సభల్లో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను బహిరంగంగా చదివించాలని, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని ఈసీకి సూచించారు. SIRలో అంగీకరించే పత్రాలపై తెలంగాణకు స్పష్టమైన, విస్తృత జాబితా ప్రకటించాలని కోరారు. మండల స్థాయిలో సులభంగా లభించే పత్రాలను కూడా అందులో చేర్చాలని సూచించారు. హైదరాబాద్‌లో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 78 వేల వరకు నోటీసు కేసులు ఉన్నాయని సీఎం వెల్లడించారు. ERO స్థాయిలో అదనపు అధికారులను నియమించి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా తుది జాబితా నుంచి తొలగిపోకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## చిన్న నీటిపారుదల పునరుద్ధరణకు సాంకేతిక వ్యవస్థలు

- సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిక
- చెరువుల రక్షణకు ప్రత్యేక చట్టం
- ఎఫ్‌టీఎల్ గుర్తించి ఆక్రమణల తొలగింపు
- చెరువుల పునరుద్ధరణపై కీలక సూచనలు



హైదరాబాద్, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్ రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థపై వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కలిసి నివేదిక అందించింది. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సాంకేతిక యూనిట్లతో చిన్న నీటిపారుదల వ్యవస్థను తిరిగి ఏర్పాటు చేయాలని కమిషన్ సూచించింది. 2లో..

## బాధితులను ఆదుకోండి

- నేపాల్ విధ్వంసంతో ఇబ్బందులు
- నేపాల్‌తో సమన్వయంతో చేయండి: ఖర్గే



5లో..

## మరో రెండు పోరాటాలకు నేతలంతా సిద్ధం కావాలి

- పార్టీ నేతలతో బీజేపీ చీఫ్ రాంచందర్ రావు
- పార్టీని రాష్ట్రంలో బలోపేతం చేయాలి
- ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై పోరాడాలి



**హైదరాబాద్, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణలో తమ పార్టీని బలోపేతం చేసే దిశగా బీజేపీ కసరత్తులు చేస్తోంది. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తను గొంతుకను వినిపిస్తోంది. 2లో..

## ఒకే కుటుంబంలో నలుగురు ఆత్మహత్య

- విశాఖపట్నంలో విషాదకర ఘటన
- ప్రవీణ్ కుమార్ ఉరివేసుకుని..
- భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు విషపదార్థం తిని ఆత్మహత్య

2లో..



## విదేశీ పర్యటనకు ప్రధాని మోదీ

### ఉజ్బెకిస్తాన్, కిర్గిజ్ రిపబ్లిక్‌లో కీలక పర్యటన



2లో..

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్**

ప్రధాని నరేంద్ర మోదీ రెండు దేశాల విదేశీ పర్యటనకు బయలుదేరనున్నారు. ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 29, 30 తేదీల్లో ప్రధాని మోదీ ఉజ్బెకిస్తాన్‌లో ద్వైపాక్షిక పర్యటన చేయనున్నారు. తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై కీలక చర్చలు జరగనున్నాయి.

## నేపాల్‌లో కొత్త సంక్షోభం..!

- 2,500 మందికి పైగా గల్లంతు
- మృతదేహాలు భద్రపర్చేందుకు స్థలం కరువు
- 600 దాటిన మృతులు
- మరణాలు ఇంకా పెరిగే అవకాశం 2లో..



**కట్మాండు, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్**

నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. వరదల కారణంగా మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు. దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. అయితే మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

## మున్సిపల్ చట్ట సవరణకు గవర్నర్ ఆమోదం

- కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో..
- ప్రత్యక్ష ఎన్నికలకు సంబంధించి..
- స్థానిక సంస్థల పాలనలో పలు మార్పులు 2లో..



## వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి ఫైర్



2లో..

## పుజల్ జైలులో విజయ్ సడన్ ఇన్‌స్పెక్షన్

- ఆసుపత్రి, లైబ్రరీ, కంప్యూటర్ సెంటర్ తనిఖీ
- ఖైదీల ఆహారం, వైద్య సదుపాయాలపై సమీక్ష



**చెన్నై, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్**


చెన్నైలోని పుజల్ సెంట్రల్ జైలులో తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. దేశంలోని అతిపెద్ద జైలు సముదాయాల్లో ఒకటైన పుజల్ జైలును సందర్శించిన సీఎం.. అక్కడ ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, ఆహారం, వైద్య సేవలు, మౌలిక వసతులు, పునరావాస కార్యక్రమాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జైలు అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి విజయ్.. ఖైదీల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2లో..

## జగన్‌కు నమ్మక ద్రోహం చేయలేదు

- ఇప్పుడు వైసీపీలో నంబర్ 1 సజ్జలనే
- విజయసాయి రెడ్డి బహిరంగ లేఖ
- నా రక్తంలోనే నమ్మకద్రోహం లేదు
- కేసుల్లో పేర్లు.. కోటరీ కుట్రలు

**హైదరాబాద్, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు, అధికార సమీకరణాలపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి బహిరంగ లేఖ రాశారు. పార్టీలో సజ్జల రామకృష్ణారెడ్డి కోటరీ వల్ల తనకు జరిగిన అవమానాలు, పార్టీ వీడటానికి గల కారణాలను ఆయన ఐదు పేజీల లేఖలో సమగ్రంగా వెల్లడించారు. సోషల్ మీడియాలో తనపై "నమ్మకద్రోహి" అని వైసీపీ కోటరీ చేస్తున్న దుష్ప్రచారానికి ఈ లేఖ ద్వారా కౌంటర్ ఇచ్చారు.



2లో..

## తెలంగాణ క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలి

- శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- ప్రభుత్వ పాలనపై ప్రజలు హ్యాపీ
- రేవంత్ యువకుడు, ఉత్సాహవంతుడు
- ముఖ్యమంత్రిని పని చేసుకోనివ్వాలి



2లో..

**హైదరాబాద్, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడని అన్నారు. ముఖ్యమంత్రిని పని చేసుకోనివ్వాలని, ఆటంకాలు సృష్టించకూడదని చెప్పారు. కాంగ్రెస్ క్యాడర్‌లో అసంతృప్తి ఉందని.. ప్రజలు సంతృప్తికరంగానే ఉన్నారన్నారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
ఆదివారం। రంగారెడ్డి
30.08.2026



# జగన్‌కు నమ్మక ద్రోహం చేయలేదు

(మొదటి పేజీ తరువాయి)



"నేను నమ్మకద్రోహినే అయితే ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి చేసుకుని, సీబీఐ, ఈడీ ఛార్జ్‌షీట్లలో నా పేరు లేకుండా చేసుకునేవాడిని" అని విజయసాయిరెడ్డి తన లేఖలో వ్యాఖ్యానించారు. జగన్‌కు అత్యంత నమ్మకస్తుడిగా ఉన్నందుకే ఆయనతో పాటు ప్రతి ఛార్జ్‌షీట్‌లో తనను ఎ2గా చేర్చారని గుర్తుచేశారు. వైఎస్ జగన్ 16 నెలలు జైల్లో ఉంటే, తాను కూడా 15 నెలలు జైలు జీవితం గడిపానని, నమ్మకద్రోహం చేసే మనస్తత్వమే ఉంటే ఆనాడే అప్రూవర్‌గా మారేవాడినని స్పష్టం చేశారు.

కేసుల్లో పేర్లు.. కోటరీ కుట్రలు

2024 ఎన్నికల తర్వాత కూడా తనకు ఎలాంటి సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లో A5గా, కాకినాడ సీపోర్టు కేసులో A2గా తన పేరును చేర్చారని విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో "సకల శాఖ మంత్రి" పేరు మాత్రం ఏ ఛార్జ్‌షీట్‌లోనూ లేకపోవడంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డికి తెలియకుండా వెన్నుపోటు పొడుస్తూ, కేసులు లేకుండా ఎలా బయటపడాలో అక్కడ ఉన్న కోటరీ నాయకుడికి బాగా తెలుసని ధ్వజమెత్తారు.

సజ్జలే పార్టీకి నంబర్ 1...

వైసీపీలో ప్రస్తుత పరిస్థితులను విశ్లేషిస్తూ, "ఇప్పుడు ఆ పార్టీలో నంబర్ 2 జగన్ అయితే, నంబర్ 1 సకల శాఖల మంత్రి సజ్జల" అని తీవ్రంగా వ్యాఖ్యానించారు. 2019 విజయాల తర్వాత సజ్జల రాజ్యాంగేతర శక్తిగా మారి, మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా జగన్ అపాయింట్‌మెంట్ దక్కకుండా గోడ కట్టారని ఆరోపించారు. 2022 మంగళగిరి ప్లీనరీలో సకల శాఖ మంత్రి తనపై భౌతికంగా దాడి చేసినా జగన్ ప్రేక్షకపాత్ర వహించారని, ఆ తర్వాత వరుసగా రీజినల్ కోఆర్డినేటర్, జిల్లా ఇన్చార్జ్, అనుబంధ సంఘాల ఇన్చార్జ్ బాధ్యతల నుంచి తనను తప్పించి అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ఆత్మగౌరవాన్ని చంపుకుని సజ్జల కింద పనిచేయడం ఇష్టం లేకనే నాలుగేళ్ల రాజ్యసభ పదవీ కాలాన్ని, పార్టీని వదులుకున్నానని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. తాను ఎప్పటికీ జగన్‌కు నమ్మకద్రోహం చేయలేదని... చేయబోనని స్పష్టం చేస్తూ, త్వరలోనే కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు సూచనప్రాయంగా వెల్లడించారు.

# మరో రెండు పోరాటాలకు నేతలంతా సిద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)



ఈ మేరకు ఆ పార్టీ చీఫ్ రాంచందర్ రావు అధ్యక్షతన ఫీజు బకాయిల చెల్లింపు కోసం ఇటీవల దీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. మరో రెండు పోరాటాలకు బీజేపీ నాయకులు సన్నద్ధమవుతున్నారు.

22ఏలో చేర్చిన భూమి సంబంధించిన బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల 5,6 తేదీల్లో టీబీజేపీ నేతలు మరో దీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఈరోజు( శనివారం) రాంచందర్ రావు అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈ భేటీలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో 22ఏ వ్యవహారంపై చేసే దీక్షపై సుదీర్ఘంగా చర్చ జరగనున్నట్లు సమాచారం. దీక్షకు సంబంధించిన కార్యాచరణపై రాంచందర్ రావు నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో పార్టీ బలాబలాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. పార్టీని బలోపేతం చేసే దిశలో భవిష్యత్తు కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ సమావేశం అనంతరం బీజేపీ తదుపరి కార్యాచరణపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు క్లారిటీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

**పాయల్ శంకర్ 'రైతు యాత్ర'**

మరోవైపు ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి అసెంబ్లీ వరకు రైతుయాత్ర చేపట్టేందుకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ సిద్ధమవుతున్నారు.

# ఒకే కుటుంబంలో నలుగురు ఆత్మహత్య

విశాఖపట్నం, ఆగస్ట్ 29, అనంత జనశక్తి న్యూస్

విశాఖ జిల్లా పెందుర్తి పరిధిలోని చింతల అగ్రహారంలో విషాద ఘటన చోటుచేసుకుంది. కొత్తవలసకు చెందిన మల్లా వినోద్ కుమార్ కొంతకాలంగా జీవనోపాధి కోసం పెందుర్తిలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. వినోద్ ఆటో డ్రైవర్‌గా, అతని భార్య కాయగూరల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ దంపతులకు రెండేళ్లు, మూడేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులు ఉన్నారు. రాఖీ పండుగ సందర్భంగా నిన్న కుటుంబ సభ్యులతో రాఖీలు కట్టించుకున్న వినోద్ కుమార్.. రాత్రి సమయంలో సెల్‌ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు 'RIP' అంటూ సందేశం పంపినట్లు సమాచారం. ఆ తర్వాత ప్రవీణ్ కుమార్ ఉరివేసుకుని, అతని భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు విషపదార్థం తిని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తల్లి, ఇద్దరు బిడ్డలను వెంటనే ఆస్పత్రికి తరలించగా..అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రాఖీ పండుగ రోజున కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిన అనంతరం చోటుచేసుకున్న ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలా.. ఆర్థిక ఇబ్బందులు కారణమా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

# తెలంగాణ క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలి

(మొదటి పేజీ తరువాయి)

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే సీఎం రేవంత్ రెడ్డి కొత్త వాటిని అమలు చేస్తున్నారని గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రివర్గంపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అయ్యిందని, క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ చేస్తే కొత్తదనం వస్తుందన్నారు. తెలంగాణలో ఏ రాజకీయ పార్టీలోనూ క్రమశిక్షణ లేదని, కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు తగ్గించాలన్నారు. అదేవిధంగా పార్టీ లైన్ దాటిన వారిపై వేటు వేయకపోతే నష్టం జరుగుతుందన్నారు. పార్టీలో లీకేజీలను కంట్రోల్ చేయాలని, క్రమశిక్షణ ముఖ్యమని ఆయన చెప్పుకొచ్చారు. మరోవైపు, నాలుగు పంటలకూ రైతు భరోసా అందించాలని శాసన మండలి ఛైర్మన్ విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22Aని రద్దు చేయాలని సూచించారు. ప్రజలకు ఉచిత పథకాలను తగ్గించాలని, నిజమైన లబ్ధిదారులకే వాటిని అందించాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయెుద్దని, వారికి న్యాయం చేయాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

# మున్సిపల్ చట్ట సవరణకు గవర్నర్ ఆమోదం

అమరావతి, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ పాలనకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ప్రత్యక్ష ఎన్నికలకు సంబంధించిన ఏపీ మున్సిపల్ లా సవరణ చట్టానికి గవర్నర్ ఆమోదం లభించింది. ఈ సవరణలతో స్థానిక సంస్థల పాలనలో పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. సవరించిన చట్టం ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ పదవుల సంఖ్యను రెండింటి నుంచి ఒకటికి తగ్గించారు. అలాగే మున్సిపాలిటీల్లో ఉన్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ పదవులను కూడా రెండింటి నుంచి ఒకటికి కుదిస్తూ చేసిన సవరణకు గవర్నర్ ఆమోదం తెలిపారు. గవర్నర్ ఆమోదం పొందిన సవరణ చట్టాన్ని అధికారిక గెజిట్‌లో ప్రచురించేలా న్యాయ శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేయనున్నారు. గెజిట్‌లో ప్రచురణ అనంతరం ఈ సవరణలకు అధికారికంగా చట్టబద్ధత లభించనుంది.

w కొత్త జిల్లాలతో 28 జెడ్పీల ఏర్పాటు

మరోవైపు రాష్ట్రంలోని జిల్లా పరిషత్‌ల సంఖ్యకు సంబంధించి కూడా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 13 జిల్లా పరిషత్‌లకు అదనంగా కొత్త జిల్లాలను చేర్చి మొత్తం 28 జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే దిశగా పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు అనుగుణంగా మొత్తం 28 జెడ్పీల ఏర్పాటు కోసం చేసిన పంచాయతీరాజ్ సవరణ చట్టానికి కూడా గవర్నర్ ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రంలో కొత్త జిల్లాల ప్రాతిపదికన జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణకు మార్గం సుగమమైంది. మున్సిపల్ సంస్థల్లో పదవుల సంఖ్యను కుదించడం, కొత్త జిల్లాల నేపథ్యంలో జెడ్పీలను పునర్వ్యవస్థీకరించడం వంటి కీలక మార్పులకు గవర్నర్ ఆమోదం లభించడంతో రాష్ట్ర స్థానిక సంస్థల వ్యవస్థలో మార్పులు చోటుచేసుకోనున్నాయి.

# పుజల్ జైలులో విజయ్ సడన్ ఇన్‌స్పెక్షన్

(మొదటి పేజీ తరువాయి)

పర్యటనలో ముఖ్యమంత్రి విజయ్ ఖైదీలతో నేరుగా మాట్లాడారు. వారి సమస్యలు, అవసరాలు, జైలులో అందుతున్న సౌకర్యాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా? వైద్య సేవలు ఎలా ఉన్నాయి? ఆహారం నాణ్యత ఎలా ఉంది? వంటి అంశాలపై సీఎం ఆరా తీసినట్లు అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.

**ఆసుపత్రి, పునరావాస కేంద్రం పరిశీలన**

పుజల్ సెంట్రల్ జైలు 1లోని పలు ప్రాంతాలను ముఖ్యమంత్రి విజయ్ పరిశీలించారు. ఇందులో ఏకాంత నిర్బంధ వార్డు, సందర్శకుల గది, ఆసుపత్రి, వ్యసన విముక్తి, పునరావాస కేంద్రం ఉన్నాయి. అలాగే ఖైదీలకు విద్య, నైపుణ్యాభివృద్ధి అందించేందుకు ఏర్పాటు చేసిన తరగతి గదులు, గ్రంథాలయం, అధునాతన కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని కూడా సీఎం సందర్శించారు.

**హై సెక్యూరిటీ బ్లాక్, ఉరి ప్రదేశం తనిఖీ**

జైలు భద్రతా ఏర్పాట్లను కూడా ముఖ్యమంత్రి విజయ్ పరిశీలించారు. ఇందులో భాగంగా అత్యంత భద్రతా విభాగాన్ని, ఉరితీసే ప్రాంతాన్ని కూడా తనిఖీ చేసినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. జైలు ప్రాంగణంలో ఉన్న పోలీస్ స్టేషన్‌తో పాటు వివిధ శిక్షణా కేంద్రాలను కూడా సీఎం పరిశీలించారు. ఖైదీలకు అందించే ఆహార నాణ్యతను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. ఆహారం తయారీ, నాణ్యత, ఖైదీలకు అందుతున్న విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందుతున్న ప్రాథమిక సౌకర్యాలు, ఆహారం, వైద్య సేవలు, వృత్తి శిక్షణ వంటి అంశాలను సీఎం సమీక్షించినట్లు ప్రభుత్వం తెలిపింది.

ఖైదీలు తయారు చేస్తున్న ఉత్పత్తుల పరిశీలన

జైలులోని వృత్తి శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి.. ఖైదీలు స్వయంగా తయారు చేస్తున్న వివిధ ఉత్పత్తులను పరిశీలించారు. వీటిలో కూరగాయల నిల్వ కోసం ఉపయోగించే ఇనుప ర్యాక్‌లు, కాగితపు కవర్లు, ఆఫీస్ ఫైల్ బోర్డులు, చేనేత ఉత్పత్తులు, కుట్టు పని విభాగంలో తయారు చేసిన వస్తువులు ఉన్నాయి. ఖైదీలకు శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో నైపుణ్యాలను పెంపొందించి, జైలు నుంచి విడుదలైన తర్వాత స్వయం ఉపాధి లేదా ఉద్యోగ అవకాశాలను పొందేలా చేయడం పునరావాస కార్యక్రమాల ప్రధాన లక్ష్యాల్లో ఒకటి.

**ఖైదీల పునరావాసంపై దృష్టి**

జైలు కేవలం శిక్షను అమలు చేసే ప్రదేశంగా కాకుండా, ఖైదీలలో మార్పు తీసుకురావడానికి, వారికి కొత్త నైపుణ్యాలను నేర్పడానికి పునరావాస కార్యక్రమాలు కూడా ముఖ్యమైనవిగా ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో పుజల్ జైలులో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ, కంప్యూటర్ విద్య, చేనేత, కుట్టుపని, అడిక్షన్ రికవరీ ప్రోగ్రామ్స్‌ను ముఖ్యమంత్రి విజయ్ పరిశీలించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# చిన్న నీటిపారుదల పునరుద్ధరణకు సాంకేతిక వ్యవస్థలు

(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి నేతృత్వంలో సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గంగాధర్, ఎం. భవానీరెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని కలిసి నివేదిక అందించారు.

సిఫారసులపై చర్చ

కమిషన్ సిఫారసులపై ముఖ్యమంత్రి ప్రతినిధి బృందంతో చర్చించారు. పంటల మార్పిడి, ఉద్యానవన పంటల సాగు పెంపు, ఎఫ్‌పీవోల ఏర్పాటు వంటి అంశాలపై కమిషన్ ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

**చిన్న నీటిపారుదలపై కీలక సూచనలు**

రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచడానికి కమిషన్ పలు కీలక సూచనలు చేసింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను అనుసంధానిస్తూ కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. చెరువుల పరిరక్షణకు ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల చట్టం రూపొందించాలని సూచించింది. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్) సరిహద్దులను తక్షణమే గుర్తించి, ఆక్రమణలను తొలగించి పరిరక్షించాలని పేర్కొంది.

**చెరువుల పునరుద్ధరణ అవసరం**

తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని కమిషన్ నివేదికలో తెలిపింది.

గడిచిన రెండేళ్లలో రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సూచనలను ప్రతినిధి బృందం వివరించింది. కమిషన్ పనితీరుపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.





# విదేశీ పర్యటనకు ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్




ప్రధాని నరేంద్ర మోదీ రెండు దేశాల విదేశీ పర్యటనకు బయలుదేరనున్నారు. ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 29, 30 తేదీల్లో ప్రధాని మోదీ ఉజ్బెకిస్తాన్‌లో ద్వైపాక్షిక పర్యటన చేయనున్నారు. తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై కీలక చర్చలు జరగనున్నాయి.

ఉజ్బెకిస్తాన్‌లో ప్రధాని మోదీకి ఇది నాలుగో పర్యటన కానుంది. ఈ పర్యటనలో భారత్, ఉజ్బెకిస్తాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంతో పాటు.. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ రంగాల్లో పరస్పర సహకారంపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. అలాగే డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య తదితర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించే అంశాలపై కూడా చర్చలు జరగనున్నాయి.

భారత్ 'విక్షిత్ భారత్ 2047' అభివృద్ధి దార్శనికతతో పాటు ఉజ్బెకిస్తాన్ 'ఉజ్బెకిస్తాన్2030' అభివృద్ధి ప్రణాళికలపై కూడా ఇరు దేశాల మధ్య అభిప్రాయాల మార్పిడి జరగనుంది. భవిష్యత్‌లో ఆర్థిక, సాంకేతిక, మౌలిక వసతుల రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. తాష్కెంట్‌లో ప్రధాని మోదీ పలు ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. లాల్ బహదూర్ శాస్త్రి మెమోరియల్‌ను సందర్శించడంతో పాటు తాష్కెంట్ స్టేట్ యూనివర్శిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని కూడా సందర్శించనున్నారు. ఉజ్బెకిస్తాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు కిర్గిజ్ రిపబ్లిక్‌లో పర్యటించనున్నారు. కిర్గిజ్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ బిష్కెక్‌కు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా 26వ షాంఘై సహకార సంస్థ (SCO) శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొంటారు. SCO 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. 2017 నుంచి భారత్ SCOలో పూర్తి సభ్యదేశంగా కొనసాగుతోంది. SCO సమావేశంలో భద్రత, అనుసంధానం, ప్రాంతీయ సహకారం, అభివృద్ధి అవకాశాలపై భారత ప్రాధాన్యతలను ప్రధాని మోదీ ప్రస్తావించనున్నారు. ఈ సందర్భంగా SCO సభ్యదేశాల నేతలతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. అలాగే కిర్గిజ్ రిపబ్లిక్‌లో జరిగే 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవానికి కూడా ప్రధాని మోదీ హాజరుకానున్నారు. మధ్య ఆసియా సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే ఈ క్రీడలు ప్రాంతీయ సాంస్కృతిక సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి.

# నేపాల్‌లో కొత్త సంక్షోభం..!

(మొదటి పేజీ తరువాయి)

వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది.

**మృతదేహాల గుర్తింపునకు ఫొటోలు, ట్యాగ్‌లు**

నేపాల్ పోలీస్ ఎస్పీ రమేశ్వర్ పౌడెల్ తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

కుటుంబ సభ్యులకు ఫొటోలు చూపించి గుర్తింపు

గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు. మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**ఫింగర్‌ప్రింట్, DNA నమూనాల సేకరణ**

ముఖం ద్వారా గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు వేలిముద్రలు, DNA నమూనాలను సేకరిస్తున్నారు. బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాలను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగపడతాయి. కాస్కీ జిల్లా పోలీస్ చీఫ్ నబిన్ కార్కీ ప్రకారం, బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, DNA నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**2021 మార్గదర్శకాల ప్రకారం మృతదేహాల నిర్వహణ**

మృతదేహాల నిర్వహణ కోసం నేపాల్‌లో అమల్లో ఉన్నాయి. జిల్లా పోలీస్ చీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలు గుర్తు తెలియని, బంధువులు ఎవరూ క్లెయిమ్ చేయని మృతదేహాలను నిర్వహిస్తాయి. అయితే ప్రస్తుతం వరుసగా మృతదేహాలు వస్తుండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లా స్థాయి కమిటీలు కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాయి.

**2,500 మందికి పైగా గల్లంతు**

వరదల్లో గల్లంతైన 2,500 మందికి పైగా వ్యక్తుల కోసం సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రస్తుతం అధికారికంగా మృతుల సంఖ్య 616కి చేరినట్లు సమాచారం. సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని మృతదేహాలు వెలికితీయడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**భారత్, చైనా నుంచి సహాయం**

పరిస్థితి తీవ్రంగా మారడంతో నేపాల్ విదేశీ సహాయాన్ని స్వీకరించేందుకు అంగీకరించింది. ముఖ్యంగా భారత్, చైనాకు చెందిన సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలు స్థానిక అధికారులకు సహాయం చేసేందుకు అనుమతిస్తున్నారు. అంతర్జాతీయ సమాజం నుంచి వచ్చిన ఒత్తిడి, గల్లంతైన విదేశీ పౌరుల కుటుంబాల ఆందోళనల నేపథ్యంలో పరిమిత సంఖ్యలో నిపుణులను, సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలను నిర్దిష్ట ప్రాంతాల్లోకి అనుమతిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం తెలిపింది.

# వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే తలకిందులు తపస్సు చేసినా లాభం లేదు

- ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు
-- సంక్షేమాన్ని పట్టించుకోలేదని ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్ట్ 29, అనంత జనశక్తి న్యూస్



ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈరోజు(శనివారం) మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను అందజేస్తున్నామన్నారు. పిల్లల చదువు కోసం, అవసరాల కోసం భూమిని అమ్ముకొనే అవకాశం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పట్టాదార్ పాస్‌బుక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

'మీరు తలక్రిందులుగా తపస్సు చేసినా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని మంత్రి స్పష్టం చేశారు. 63 వేల కోట్ల ఆడబిడ్డలకు సున్నా వడ్డీకి రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు అందించామని తెలిపారు. సర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను తీసుకున్నామని.. ఈ సర్వేతో దొంగ పట్టాలను గుర్తించవచ్చని చెప్పారు. రాబోయే సంవత్సరన్నర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తే ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ప్రతిపక్షాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# ఎన్‌టీఏకు ఐదుగురు అధికారుల నియామకం



**– డైరెక్టర్‌గా ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారి ప్రసన్న వెంకటేష్**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)కి కేంద్ర ప్రభుత్వం ఒక జాయింట్ సెక్రటరీ, ముగ్గురు డైరెక్టర్లు, ఒక జాయింట్ డైరెక్టర్‌ను నియమించింది. 2005 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి అన్షుమన్ శర్మ జాయింట్ సెక్రటరీగా, 2012 బ్యాచ్ ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారి వి.ప్రసన్న వెంకటేష్, 2012 బ్యాచ్ యూటీ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి రవికుమార్‌సింగ్, 2011 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి సాతియాలను డైరెక్టర్లుగా, 2016 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి అమిత్ సమదారియాను జాయింట్ డైరెక్టర్‌గా నియమిస్తూ సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ వేర్వేరుగా ఉత్తర్వులిచ్చింది. ప్రస్తుతం ఏపీ సర్వీసులో ఉన్న ప్రసన్న వెంకటేష్ కేంద్ర ఉన్నత విద్యాశాఖకు డిప్యుటేషన్‌పై బదిలీ కానున్నారు. ఇందుకోసం రాష్ట్ర సర్వీసుల నుంచి రిలీవ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది. ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఐదేళ్లు కానీ, లేదంటే తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు ఈ పదవిలో ఉంటారు. ఆయన స్వరాష్ట్రం తమిళనాడు. ప్రస్తుతం ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శిగా, లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వీసీఎండీగా పనిచేస్తున్నారు. గతంలో విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల కలెక్టర్‌గా సేవలందించారు. ఎంపికైన అధికారులు మూడు వారాల్లోగా కొత్త బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# కర్ణాటక మంత్రి నాగేంద్ర రాజీనామా

కర్ణాటక ప్రణాళిక, గణాంకాలశాఖ మంత్రి బి.నాగేంద్ర తన పదవికి రాజీనామా చేశారు. కర్ణాటక వాల్మీకి గిరిజన అభివృద్ధి మండలి నిధులు మళ్లించారంటూ ఆరోపణలున్న బి.నాగేంద్ర.. ఆగస్టు 3న డీకే శివకుమార్ మంత్రివర్గంలో చేరారు. అవినీతి ఆరోపణలున్న నాగేంద్రను మంత్రివర్గం నుంచి తొలగించాలని ప్రధాన విపక్షం భాజపా ఇటీవల శాసనసభ సమావేశాల్లో చర్చలకు అవకాశం ఇవ్వకుండా ఆందోళన చేపట్టింది. సెప్టెంబరు 1న రాయచూరు నుంచి బళ్లారి వరకు పాదయాత్ర చేసేందుకు సిద్ధమైంది. దీనిపై శుక్రవారం విలేకర్లతో మాట్లాడిన మంత్రి నాగేంద్ర.. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలగకూడదని స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఒక దళితుడి ప్రగతిని ఓర్వలేని భాజపా.. తనపై ఎలాంటి ఆరోపణలు లేకున్నా ప్రజలను తప్పుదోవ పట్టించిందని భావోద్వేగానికి లోనయ్యారు. తనపై పదేపదే ఆరోపణలు చేస్తున్న బళ్లారి భాజపా నాయకులు బి.శ్రీరాములు, జనార్దనరెడ్డిలను ప్రజాక్షేత్రంలోనే ఎదుర్కొనేందుకు ఎమ్మెల్యే పదవికీ రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.



తొలుత సిద్ధరామయ్య ప్రభుత్వంలోనూ బి.నాగేంద్ర మంత్రిగా పనిచేశారు. వాల్మీకి గిరిజన అభివృద్ధి మండలి నిధులు అనధికారిక ఖాతాలకు బదిలీ అయ్యాయని నోట్ రాసి.. ఇదే మండలి ఎకౌంట్స్ సూపరింటెండెంట్ పి.చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటికి గిరిజన సంక్షేమ మంత్రిగా ఉన్న బి.నాగేంద్ర నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు. ఈ ఆరోపణలపై విచారణ చేపట్టిన ఈడీ అధికారులు రూ.89.93 కోట్ల నిధులు యూనియన్ బ్యాంక్ నుంచి వివిధ ఖాతాలకు బదిలీ అయినట్లు తేల్చారు. ఈ క్రమంలో బి.నాగేంద్రను అరెస్ట్ చేశారు. రాష్ట్ర సీఐడీకి చెందిన సిట్ బృందం బి.నాగేంద్రకు క్లీన్‌చిట్ ఇచ్చినా.. ఈడీ, సీబీఐలు ఇంకా నిర్దోషిగా తేల్చలేదు. ఇదే అంశంతో భాజపా ఆందోళన చేపట్టడం గమనార్హం.

# సరికొత్త ఆట.. మూడు జట్ల క్రీడంట!

**సాధారణంగా ఏదైనా క్రీడలో రెండు జట్లు పోటీ పడుతుండటం మనకు తెలుసు. అదే ఒకే ఆటలో మూడు జట్లు ఒకేసారి తలపడటం కొత్తగా అనిపిస్తుంది కదూ! వినడానికి ఆసక్తిగా అనిపిస్తున్న ఇలాంటి క్రీడను ఐఐటీ మద్రాస్ రూపొందించి, శుక్రవారం ప్రారంభించింది. దీనికి 'ఫైబాల్' అనే పేరు పెట్టింది. సంప్రదాయ బాస్కెట్‌బాల్ ఆటను ఆధారంగా చేసుకుని దీన్ని అభివృద్ధి చేశారు. వృత్తాకార కోర్టులో ఈ ఆట ఆడుతారు. మైదానంలో మూడు బాస్కెట్లు ఉంటాయి. ప్రతి జట్టులో ఏడుగురు ఆటగాళ్లు ఉంటారు. ప్రతి జట్టు ఒక బాస్కెట్ను కాపాడుకుంటూ ప్రత్యర్థి రెండు బాస్కెట్లలో స్కోర్ చేయాల్సి ఉంటుంది. 'ఆగస్టు 29న హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ ఆటను ప్రారంభించాం. ఇది శారీరక దృఢత్వం, వేగవంతమైన నిర్ణయాలు, టీమ్‌వర్క్‌కు ఎంతగానో ఉపయోగపడుతుంది' అని ఐఐటీ మద్రాస్ తెలిపింది.**





# కొలంబియా యూనివర్సిటీతో VIT అవగాహన ఒప్పందం

అమెరికా న్యూయార్క్‌లోని ప్రఖ్యాత కొలంబియా యూనివర్సిటీతో (కొలంబియా ఇంజినీరింగ్) వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. న్యూయార్క్‌లోని భారత కాన్సుల్ జనరల్ బినయ శ్రీకాంత ప్రధాన్ సమక్షంలో వీఐటీ ఛాన్సలర్ డా. జి. విశ్వనాథన్, కొలంబియా ఇంజినీరింగ్ అకడమిక్ అఫైర్స్ అండ్ గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్స్ డీన్ సెన్. సొలేమానే కచాని అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో కొలంబియా యూనివర్సిటీతో డ్యూయల్ డిగ్రీ ఒప్పందం కుదుర్చుకున్న తొలి భారతీయ విశ్వవిద్యాలయంగా వీఐటీ నిలిచింది. దీనివల్ల ఇంజినీరింగ్ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యా అవకాశాలు, నాణ్యమైన విద్య అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా దీన్నొక కీలక ఘట్టంగా డా‖ జి.విశ్వనాథన్ అభివర్ణించారు. ఈ భాగస్వామ్య ఒప్పందంతో VIT ఇంజినీరింగ్ విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అభ్యసించే అవకాశం ఏర్పడుతుంది. అంతర్జాతీయంగా కెరీర్‌ను నిర్మించుకునేందుకు సరికొత్త మార్గాలు ఏర్పడతాయి. ఈ కార్యక్రమంలో VIT ఉపాధ్యక్షుడు డా. జి. వి. సెల్వం, డైరెక్టర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డా. ఆర్. శీనివాసన్ పాల్గొన్నారు.


# మహారాష్ట్ర ఎంపీఎస్‌సీ పేపర్ లీక్ కేసులో షాకింగ్ ట్విస్టులు

**- 10 తప్పులు రాయాలంటూ చాట్, బ్రేకప్ కావడంతో వెలుగులోకి!**

మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీఎస్‌సీ) నిర్వహించిన డ్రగ్ ఇన్ స్పెక్టర్ నియామక పరీక్ష క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారంలో ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు తీవ్ర దిగ్భ్రాంతికరమైన విషయాలను బయటకు తీసింది. ఈ స్కామ్‌లో ప్రధాన నిందితురాలైన రితుజా పాటిల్‌కు పరీక్ష కంటే ముందే లీకైన ప్రశ్నాపత్రం అందింది. అయితే మొదటి ర్యాంక్ లేదా వందకు వంద మార్కులు వస్తే అధికారులకు అనుమానం వస్తుందనే భయంతో కనీసం 10 ప్రశ్నలకు కావాలనే తప్పు సమాధానాలు రాయాలని ఎంపీఎస్‌సీ ఉద్యోగులు ఆమెకు సలహా ఇచ్చారు. ఈ మేరకు వారి మధ్య నడిచిన వాట్సాప్ సంభాషణల ఆధారాలను పోలీసులు సేకరించారు. మార్చి 22న జరిగిన ఈ పరీక్ష ప్రశ్నాపత్రం రితుజాకు మార్చి 20నే లభించింది. పరీక్షలో 294 ప్రశ్నలకు గాను లీకైన పేపర్‌లోని 77 ప్రశ్నలు నేరుగా మ్యాచ్ అయ్యాయి. దీంతో ఆమె ఏకంగా ఏడో ర్యాంకు సాధించింది.

**తండ్రి ఇచ్చిన రూ. 5 లక్షల లంచం!**

ఈ అక్రమం వెనుక భారీ ముఠా హస్తం ఉంది. ప్రారంభంలో ప్రశ్నాపత్రం కొనుగోలు చేసేందుకు తన ప్రియుడు గౌరవ్ పాటిల్ అలియాస్ లోకేష్‌ను రితుజా రూ. 5 లక్షలు అడిగింది. కానీ ఆర్థిక సమస్యల వల్ల అతను డబ్బులు ఇవ్వలేకపోయాడు. దాంతో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న తన తండ్రి అమృత్ పాటిల్‌ను ఆశ్రయించగా.. ఆయన కుమార్తె కోసం రూ. 5 లక్షలు ఇచ్చారు. నాసిక్‌లోని ఒక



ఫ్లాట్‌లో ఈ డీల్ కుదిరింది. ఆ మొత్తాన్ని నందుర్బార్‌కు చెందిన మధ్యవర్తి, కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు ప్రవీణ్ పాటిల్‌కు అందించగా.. అతను ఎంపీఎస్‌సీ అధికారులు గోపాల్ మరాఠే, విశ్వేశ్వర్ నకటే, అభిజీత్ లెండ్వేల ద్వారా క్వశ్చన్ పేపర్‌ను సంపాదించి రితుజాకు చేరవేశాడు. అయితే పరీక్ష పూర్తయిన తర్వాత రితుజా, గౌరవ్‌ల మధ్య మనస్పర్థలు వచ్చి బ్రేకప్ జరిగింది. ప్రభుత్వ ఉద్యోగం వస్తే రితుజా తనను వదిలేసి వెళ్లిపోతుందనే ఈర్ష్య, భయంతో గౌరవ్ ఈ పేపర్ లీక్‌పై ఎంపీఎస్‌సీకి ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశాడు. అయితే విచారణ తీవ్రతరం కావడంతో కంగారుపడిన గౌరవ్ తన ఫిర్యాదును వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నించాడు. కానీ విచారణలో అసలు నిజం బయటపడింది. గౌరవ్ సోదరుడు కూడా ఇదే పరీక్ష రాస్తుండటంతో.. పరీక్షకు రెండ్రోజుల ముందే రితుజా ఆ లీకైన పేపర్‌ను గౌరవ్‌కు వాట్సాప్‌లో పంపినట్లు ఆధారాలు లభించాయి. దీంతో ఫిర్యాదు చేసిన గౌరవ్‌ను కూడా పోలీసులు నిందితుడిగా చేర్చారు.

ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు రితుజా తండ్రి అమృత్ పాటిల్, ప్రియుడు గౌరవ్, మధ్యవర్తి ప్రవీణ్ పాటిల్‌తో పాటు ముగ్గురు ఎంపీఎస్‌సీ ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితురాలు రితుజా పాటిల్ ప్రస్తుతం పరారీలో ఉంది. ఇది మాస్ పేపర్ లీక్ కాదని, కేవలం ఒకే ఒక్క వ్యక్తికి లీకైందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పష్టం చేసినప్పటికీ.. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎంపీఎస్‌సీ ఈ నియామక ప్రక్రియను, పరీక్షను పూర్తిగా రద్దు చేసింది. మరోవైపు ఈ అంశంపై ఎన్సీపీ ఎమ్మెల్యే రోహిత్ పవార్, బీజేపీ నాయకుల మధ్య తీవ్ర రాజకీయ యుద్ధం నడుస్తోంది. సెప్టెంబర్ 1వ తేదీన భారీ నిరసన ప్రదర్శనకు రోహిత్ పవార్ పిలుపునిచ్చారు.

# బాధితులు, ప్రభుత్వం అప్పీల్ చేయకుండా శిక్షను పెంచే అధికారం అప్పీలేట్ కోర్టులకు లేదు:

**– సుప్రీం కోర్టు**

ఒక కేసులో బాధితులు, ఫిర్యాదుదారు లేదా ప్రభుత్వం అధికారికంగా అప్పీల్ చేయకుండా అప్పీలేట్ కోర్టు స్వయంగా నిందితుడు లేదా నేరస్థుడి శిక్షను పెంచడానికి వీల్లేదని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కాలికట్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్, ఆయన భార్య, వారి సెక్యూరిటీ గార్డ్‌ను దారుణంగా హత్య చేసిన తీవ్రమైన ట్రిబుల్ మర్డర్ కేసు విచారణ సందర్భంలో సుప్రీంకోర్టు ఈ కీలకమైన వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ మనోజ్ మిస్రా, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన గోపి అనే వ్యక్తి శిక్షను పెంచుతూ మద్రాస్ హైకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేసింది.

అసలేం జరిగిందంటే..?

కాలికట్ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ మాలిక్ మహమ్మద్ వద్ద అంబరసు అనే వ్యక్తి డ్రైవర్‌గా పనిచేసేవాడు. అయితే ఓ మోసపూరితమైన అక్రమ వ్యవహారంలో పట్టుబడటంతో.. అంబరసును వీసీ ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ క్రమంలో ప్రతీకారం తీర్చుకోవాలని కసి పెంచుకున్న అంబరసు.. తన సహచరుడైన గోపితో కలిసి ప్లాన్ వేశాడు. వీసీ నివాసంలోకి చొరబడేందుకు ప్రయత్నించి, ముందుగా అక్కడ కాపలా ఉన్న వాచ్ మెన్ జ్ఞానప్రకాశంను దారుణంగా హత్య చేశారు. ఆ తర్వాత వీసీ మాలిక్ మహమ్మద్‌ను చంపేసి, ఆయన భార్య ఖతీజా బీబీని కారులో బంధించి అపహరించారు. తమిళనాడులోని విల్లుపురం జిల్లా ఒంగూర్ గ్రామానికి ఆమెను తీసుకెళ్లి.. పెట్రోల్, డీజిల్ మిశ్రమాన్ని పోసి సజీవదహనం చేశారు. 2007 నవంబర్ 14వ తేదీన పోలీసులు ఆమె పాక్షికంగా కాలిన మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ముందస్తుగా విడుదల చేసే అవకాశం లేకుండా..!

అయితే ఈ ఘోర హత్యలపై విచారణ జరిపిన విచారణ కోర్టు (ట్రయల్ కోర్టు) ప్రధాన నిందితుడు అంబరసుకు ఉరిశిక్ష విధించగా, అతనికి సహకరించిన గోపికి యావజ్జీవ కారాగార శిక్ష పడేలా తీర్పునిచ్చింది. అయితే ఈ కేసు మద్రాస్ హైకోర్టుకు వెళ్లినప్పుడు.. హైకోర్టు తన స్వీయ అధికారాలను ఉపయోగిస్తూ గోపికి విధించిన యావజ్జీవ శిక్షను "జీవితాంతం జైలులోనే ఉండేలా తీర్పునిచ్చింది. సాధారణంగా యావజ్జీవ శిక్ష పడిన వారికి 14 ఏళ్ల జైలు జీవితం పూర్తి చేసుకున్నాక చట్టపరంగా రెమిషన్ ద్వారా ముందస్తుగా విడుదలయ్యే అవకాశం ఉంటుంది. కానీ ఈ కేసులో మాత్రం గోపిని ముందుస్తుగా విడుదల చేసేందుకు ఏమాత్రం అవకాశం లేదని తేల్చి చెప్పింది.

శిక్ష పెంపును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు.. మద్రాస్ హైకోర్టు చర్యను తప్పుబట్టింది. ప్రభుత్వం కానీ, బాధిత కుటుంబం కానీ శిక్షను పెంచాలని ప్రత్యేకంగా అప్పీల్ చేయని పక్షంలో.. అప్పీలేట్ కోర్టు సుమోటోగా తన రివిజన్ అధికారాన్ని ఉపయోగించి నిందితుడి శిక్షను పెంచకూడదని స్పష్టం చేసింది. కోర్టును ఆశ్రయించిన వ్యక్తికి అంతకుముందు ఉన్న పరిస్థితి కంటే అధ్వాన్నమైన పరిస్థితిని కల్పించేలా అప్పీలేట్ కోర్టులు నిర్ణయాలు తీసుకోకూడదని తేల్చి చెప్పింది. అంతేకాకుండా శిక్షలను ఒకదాని తర్వాత ఒకటి అనుభవించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా సవరించిన అత్యున్నత కోర్టు.. ఆ శిక్షలన్నీ ఏకకాలంలో అమలు కావాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## రాఖీ కడుతుండగా కుంగిన నేల



'పళ్లెంలోని అన్నం నోటికి అందేలోపు ఏమి జరుగుతుందో చెప్పలేము' అన్నది లోకోక్తి. దీన్నే చాలామంది 'విధి లిఖితం' అని సరిపెట్టుకొంటూ ఉంటారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ జిల్లా మహారాజ్‌పుర్ పోలీస్‌స్టేషను పరిధిలో గల పుర్వామీర్ గ్రామంలో 'రక్షాబంధన్' పండుగ వేళ అటువంటి ఘటనే జరిగింది. శుక్రవారం ఉదయాన్నే నిద్ర లేచి తన సోదరుడికి శుభాకాంక్షలు తెలిపిన చుట్కీశర్మ (16) అనే యువతి రాఖీ కట్టేందుకు ఒక అడుగు ముందుకు వేయగానే.. కాళ్ల కింది నేల అమాంతం కుంగిపోయి 20 అడుగుల లోతు గుంతలోకి ఆమె పడిపోయింది. మూడేళ్ల కిందట ఆ ఇంటి ఆవరణలో బోరుబావి తవ్వగా, అది నిష్ఫలమైంది. దీంతో మూసివేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నేల వదులుగా మారడంతో ఈ ఉపద్రవం జరిగినట్లుగా భావిస్తున్నారు. అధికారుల ఆధ్వర్యంలో సహాయక బృందాలు సమాంతరంగా గుంత తవ్వి, యువతిని బయటకు తీశాయి. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించగా, అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యుడు ధ్రువీకరించారని పోలీస్ కమిషనర్ రఘుబీర్ లాల్ తెలిపారు.

## కళ్లలో నీటి సుడులు.. బరువెక్కిన బాసలు



రక్షాబంధన్ వేడుకలంటే చాలా ఇళ్లలో నోరూరించే మిఠాయిలు.. వెల్లివిరిసే నవ్వులు.. సంప్రదాయబద్ధంగా ముస్తాబై రాఖీలు కట్టే అక్కాచెల్లెళ్లకు ప్రేమగా సోదరులు అందించే కానుకలు. కొందరు తోబుట్టువులకు మాత్రం కళ్లలో పెల్లుబికే కన్నీరు, ఇనుప గోడలకు అటూ ఇటూ నిరీక్షణలు, భద్రతాపరమైన ఆంక్షల నడుమ పంచుకునే అరకొర ఆప్యాయతలు. జీవితాల్లో వేసిన తప్పటడుగుల ఫలితంగా ఖైదీలుగా జైళ్లలో ఉంటున్నవారు ఉద్వేగభరితంగా జరుపుకొన్న రాఖీ సంబరాలివి. శుక్రవారం దేశవ్యాప్తంగా పలు నగరాల్లోని జైళ్లలో హృదయాలను బరువెక్కించే ఇటువంటి దృశ్యాలు సాక్షాత్కరించాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్, ఎటా, జాలౌన్ జిల్లా జైళ్లలో శిక్షలు అనుభవిస్తున్న తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు భారీగా తరలివచ్చారు.

## లంచం ఆరోపణలు.. ఎఫ్‌డీఏ అధికారికి ఎక్స్‌పైరీ బిస్కెట్లు



గడువు ముగిసిన బిస్కెట్లు అమ్ముతున్న దుకాణదారుడికి సహకరించిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌తో ఎక్స్‌పైరీ బిస్కెట్లులోని ఛత్రపతి సంభాజీనగర్ జిల్లాలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఇటీవల స్థానిక పాన్ దుకాణంలో తినుబండారాలు తిని రెండేళ్ల చిన్నారి అస్వస్థతకు గురయ్యింది. ఆస్పత్రికి తరలించగా.. పాపను పరీక్షించిన వైద్యులు కలుషిత ఆహారం కారణమని తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు, స్థానికులు ఎఫ్‌డీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు.

దీంతో ఓ అధికారి ఆ దుకాణాన్ని తనిఖీ చేయడానికి వచ్చారు. గడువు ముగిసిన బిస్కెట్ ప్యాకెట్లు అమ్ముతున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దుకాణదారుడు లంచం ఆశ చూపించడంతో.. ఎలాంటి చర్యలు తీసుకోకుండా అతడిని కాపాడడానికి అధికారి ప్రయత్నించినట్లు స్థానికులు ఆరోపించారు. అనంతరం అధికారిని చుట్టుముట్టిన గ్రామస్థులు గడువు ముగిసిన బిస్కెట్లను తినాల్సిందిగా డిమాండ్ చేశారు. బలవంతంగా బిస్కెట్లు తినిపించడానికి ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

## 14,140 అడుగుల ఎత్తున.. వీర సైనికులకు 'రాఖీ' వందనం

భారత్, చైనా సరిహద్దులో సిక్కిం వద్ద 14,140 అడుగుల ఎత్తున ఉన్న నాథు లా పాస్‌లో రక్షాబంధన్ వేడుకలు దేశభక్తి స్ఫూర్తిని చాటాయి. దేశంలోని ఆరు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన 26 మంది యువతులు మన సరిహద్దులను కాపలా కాస్తున్న వీర సైనికులకు తిలకం దిద్ది, రాఖీలు కట్టారు. హేమంత్ యాదవ్ ఫౌండేషను ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. శెరాథాంగ్, రానీపూల్ ప్రాంతాల్లోనూ ఈ వేడుకలు జరిగాయి. సిక్కిం యూనివర్సిటీ విద్యార్థినులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఫౌండేషను వ్యవస్థాపకుడైన డాక్టర్ హేమంత్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. "రక్షాబంధన్ అనేది తోబుట్టువుల అనుబంధానికి మాత్రమే పరిమితం కాదు. ప్రేమ, నమ్మకం, బాధ్యత, రక్షణలతో కూడిన ఈ పండుగ జాతీయ సమైక్యతకు ప్రతీక. దేశంలోని 140 కోట్ల ప్రజలకు మేము ఇక్కడి నుంచి శుభాకాంక్షలు తెలుపుతున్నాం" అన్నారు. కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో దేశమాత రక్షణకు కృషి చేస్తున్న సైనికులను కలుసుకోవడం గర్వకారణమని, ఈ వేడుక తమలో కృతజ్ఞతా భావాన్ని నింపిందని కార్యక్రమంలో పాల్గొన్న యువతులు తెలిపారు.






## పాశ్చాత్య ఏఐ... మనకు సరిపోతుందా?

కృత్రిమ మేధస్సును మనం సాధారణంగా వైజ్ఞానిక శాస్త్రం, గణితం, సాంకేతికతల ఫలితంగా చూస్తాం. కానీ అసలు ప్రశ్న- తెలివి అంటే ఏంటి, దాన్ని ఎవరు నిర్వచిస్తారు అనేదే. ఏఐ కేవలం అల్గారిథం కాదు. అది- ఒక సమాజం తన విలువలను యంత్రాల్లో ప్రతిబింబించే ప్రక్రియ. కాబట్టి పాశ్చాత్య ప్రపంచం నిర్మించిన ఏఐ నమూనాలు అందరికీ సరిపోతాయా అనే సందేహం రావడం సహజం. డేటా నుంచి నిర్ణయాల వరకూ సంస్కృతి, అధికారం, అసమానతలు దాగి ఉన్నాయి. ఒక యంత్రం తెలివైనదని ఎవరు నిర్ణయిస్తారు? ఆ నిర్ణయం ఏ సంస్కృతి ప్రమాణాల ఆధారంగా జరుగుతుంది? ఈ ప్రశ్నల దగ్గరే ఏఐ భావన అసలు స్వరూపం బయటపడుతుంది.

వోల్ఫ్‌గాంగ్ వాన్ కెంపెలెన్ 1770లో ఆస్ట్రియా మహారాణి ముందు 'టర్క్' అనే చదరంగం ఆడే యంత్రాన్ని ప్రదర్శించాడు. అది ప్రత్యర్థిని ఓడిస్తుండటంతో ప్రేక్షకులు ఆశ్చర్యపోయారు. కానీ తర్వాత తెలిసిందేమిటంటే, ఆ యంత్రం లోపల ఒక నిపుణుడైన చదరంగం ఆటగాడు దాక్కుని ఉన్నాడు. అది సైన్సు కాదు, కేవలం మాయాజాలం. అమెజాన్ తన ఏఐ ఆధారిత లేబర్ మార్కెట్‌కు 'అమెజాన్ మెకానికల్ టర్క్' అని పేరు పెట్టడం యాదృచ్ఛికం కాదు. వేలమంది కార్మికులు తక్కువ వేతనాలకు చిత్రాలను వర్గీకరిస్తూ, డేటాను లేబుల్ చేస్తూ ఏఐ వ్యవస్థలకు ప్రాణం పోస్తున్నారు. ఈ అదృశ్య కార్మికులు లేకుండా ఏఐ పనిచేయలేదు. 18వ శతాబ్దపు టర్క్ యంత్రం లోపల దాక్కున్న మనిషిలాగే, నేటి ఏఐ వెనక కూడా కనిపించని మనుషులే ఉన్నారు. ముసుగు మారిందంతే, వాస్తవం కాదు.

### కొత్త వలసవాదం

ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వ్యాపిస్తున్న ఏఐ పాశ్చాత్య నమూనానే సార్వత్రికంగా ప్రకటిస్తోంది. ఆఫ్రికన్, ఆసియన్, లాటిన్ అమెరికన్ జ్ఞాన సంప్రదాయాలు అందులో కనిపించడం లేదు. ఆలన్ ట్యూరింగ్ 1950లో ఒక పరీక్షను ప్రతిపాదించాడు. యంత్రం మనిషిలా మాట్లాడగలిగితే దాన్ని తెలివైనదిగా పరిగణించవచ్చని అన్నాడు. కానీ ప్రశ్న ఏమిటంటే, ఏ మనిషిలా? ఏ భాషలో? ఒక తెలుగు రైతు, ఒక తమిళ మత్స్యకారుడు, ఒక కేరళ ఆయుర్వేద వైద్యుడు అందరూ తెలివైనవారే. వారిలో ప్రతిఒక్కరి అనుభవ జ్ఞానమూ గొప్ప మేధస్సే. కానీ ఇంగ్లిషు ఆధారంగా నిర్మించిన ఏఐ దాన్ని గుర్తించగలదా? గుర్తించలేకపోతే ఆ ఏఐ తెలివైనదా లేక పరిమితమైనదా? సార్వత్రిక తెలివి అనే భావన కూడా ఇక్కడే ప్రశ్నార్థకమవుతుంది. గణితం నిజంగా సార్వత్రికమైనది. కానీ తెలివి కేవలం గణితం కాదు. అది అనుభవం, సందర్భం, సంబంధాలు, సంస్కృతుల కలయిక. 'డేటా కొత్త చమురు' అనే నినాదం ప్రపంచవ్యాప్తంగా ప్రచారంలో ఉంది. గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్ వంటి సంస్థలు ప్రపంచమంతటా వినియోగదారుల డేటాను సేకరిస్తున్నాయి. దేశంలోని కోట్లమంది వ్యక్తుల జీవన సమాచారం అమెరికన్ కంపెనీల సర్వర్లలో నిల్వ అవుతోంది. అదే డేటాను ఉపయోగించి ఏఐ వ్యవస్థలు నిర్మించి మళ్లీ మనకే అమ్ముతున్నారు. ఇది 21వ శతాబ్దపు వలసవాదం కాకపోతే మరేంటి? మన జీవితాల సమాచారం వారికి ముడిపదార్థం. వారు దాన్ని ఏఐ ఉత్పత్తిగా మార్చి తిరిగి మన మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. రూపం మారినా ఆధిపత్యం మారలేదు.

ఒక సమాజం తన సమస్యలను పరిష్కరించడానికి ఏఐని నిర్మిస్తే, అది ఆ సమాజం విలువలను ప్రతిబింబిస్తుంది. కానీ ఇప్పుడు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఏఐ సిలికాన్ వ్యాలీ విలువలనే మోస్తోంది. అమెరికన్ న్యాయవ్యవస్థ ఆధారంగా నిర్మించిన ఏఐ భారతీయ న్యాయ విషయాల్లో సరైన నిర్ణయాలు తీసుకోగలదా? ఆయుర్వేదం, యునాని, సిద్ధ వైద్య సంప్రదాయాల జ్ఞానం అందులో స్థానం పొందగలుగుతుందా? అమెరికన్ ఏఐ వ్యవస్థలు నల్లజాతి వ్యక్తుల ముఖాలను గుర్తించడంలో ఎక్కువ తప్పులు చేస్తున్నాయని కొన్ని పరిశోధనలు కూడా పేర్కొన్నాయి. కారణం సాంకేతిక లోపం మాత్రమే కాదు. శిక్షణ డేటాలో తెల్లజాతి ముఖాలు అధికంగా ఉండటమే. అంటే, సమస్య అల్గారిథమ్‌లో కాదు, దాని వెనకున్న సాంస్కృతిక అసమానతల్లో ఉంది. అందుకే కొందరు నిపుణులు 'డీప్ లెర్నింగ్'కు ప్రత్యామ్నాయంగా 'బ్రాడ్ లెర్నింగ్'ను ప్రతిపాదిస్తున్నారు. లోతుగా వెళ్లడం కంటే విశాలంగా చూడటం మంచిదని. వేర్వేరు సంస్కృతులు, సందర్భాలు, జీవన విధానాలను అర్థం చేసుకోగల ఏఐని నిర్మించడమే ముఖ్యం. ఇది కేవలం సాంకేతిక మార్పు కాదు. ఇదొక తాత్విక విప్లవం.

### ముసుగు కాకూడదు...

మన దేశంలో కూడా ఇలాంటి ప్రశ్నలు అత్యవసరం. ఐఐటీలు, ఐఐఎస్‌సీ వంటి సంస్థలు ఏఐ పరిశోధనలో ముందున్నాయి. కానీ మనం నిర్మిస్తున్న ఏఐ భారతీయ జ్ఞాన సంప్రదాయాలను, గ్రామీణ అనుభవాలను, స్థానిక విలువలను ప్రతిబింబిస్తోందా? లేదా పాశ్చాత్య నమూనాలనే అనుసరిస్తోందా అన్నది పరిశీలనార్హం. తెలివి అనేది కొలిచే వస్తువు కాదు. అది సందర్భం, సంస్కృతి, సంబంధాలు కలిసి తయారయ్యే సజీవ ప్రక్రియ. ఒక తెలుగు తాత మనవడికి చెప్పే కథలో ఉన్న మెలకువ, తెలివి చాట్‌జీపీటీ సమాధానంలో ఉండదు. ఒక వైద్యుడు రోగిని చూసి తీసుకునే నిర్ణయంలో ఉన్న జీవానుభవం, వైద్య ఏఐ అల్గారిథమ్‌లో పూర్తిగా దొరకదు. ఇది ఏఐని తక్కువ చేయడం కాదు. మానవ మేధస్సు విశాలతను గుర్తించడం. యంత్రం తెలివైనదవుతుందా అనే ప్రశ్నకంటే ముఖ్యమైంది, మనకు అవసరమైన తెలివి ఏది, ఆ తెలివిని ఎవరు నిర్ణయిస్తారు అనేది. ఆ నిర్ణయం కేవలం సిలికాన్ వ్యాలీ ఇంజినీర్ల చేతుల్లో ఉండకూడదు. అది మన సమాజం, సంస్కృతి, అనుభవాల నుంచి పుట్టాలి. అప్పుడు మాత్రమే ఏఐ నిజంగా మానవ సేవలో తరిస్తుంది. లేకపోతే అదొక అందమైన ముసుగు వేసుకున్న మరో 'టర్క్' యంత్రంగానే మిగిలిపోతుంది.



# హైడ్రా: హైదరాబాద్ కోల్పోయిన జల రక్షణ కవచాన్ని పునరుద్ధరించే పోరాటం

1908 మూసీ వరదల నుంచి నేటి ఆక్రమణలపై పోరాటం వరకు—హైదరాబాద్ జలవనరులు దూరదృష్టి, నిర్లక్ష్యం, పట్టణ పునరుద్ధరణ అవసరాన్ని చాటుతున్నాయి.





డా. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

**ఒకప్పుడు "సరస్సుల నగరం"గా పేరొందిన హైదరాబాద్, మూసీ నది చుట్టూ విస్తరించిన చెరువులు, కుంటలు, సరస్సులు, కాలువలు, నాలాలతో కూడిన విస్తృత జల వ్యవస్థపై అభివృద్ధి చెందింది. ఈ పరస్పర అనుసంధానమైన వ్యవస్థ నగర సౌందర్యంలో భాగం మాత్రమే కాదు; వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పునఃభర్తీ చేయడం, పెరుగుతున్న నగరాన్ని వరదల నుంచి రక్షించడం వంటి కీలక విధులను నిర్వహించింది. అయితే దశాబ్దాలుగా కొనసాగుతున్న వేగవంతమైన పట్టణీకరణ, ఆక్రమణలు, పర్యావరణ మరియు భూ వినియోగ నిబంధనల అమలులో లోపాలు ఈ సహజ వరద రక్షణ వ్యవస్థను క్రమంగా బలహీనపరిచాయి.ఈ పరిస్థితిని మార్చే ప్రయత్నంలో తెలంగాణ ప్రభుత్వం 2024 జూలై 19న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీను ఏర్పాటు చేసింది. విపత్తుల సమయంలో స్పందనను బలోపేతం చేయడం, ప్రభుత్వ ఆస్తులను రక్షించడం, ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం హైడ్రా ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. రెండు సంవత్సరాల వ్యవధిలోనే హైడ్రా పట్టణ పాలనలో కీలక సంస్థగా ఎదిగింది. అయితే దాని కూల్చివేత చర్యలు న్యాయపరమైన, రాజకీయ, మానవతా అంశాలపై చర్చకు కూడా దారితీశాయి.**

1908 మూసీ వరదలు: ఒక చారిత్రక మలుపు

హైదరాబాద్ నేటి వరద ముప్పుకు మూలాలను 1908 సెప్టెంబర్‌లో సంభవించిన భయానక మూసీ వరదల్లో చూడవచ్చు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన అత్యంత భారీ వర్షాల కారణంగా మూసీ నది ఉప్పొంగి నగరంలోని అనేక ప్రాంతాలను ముంచెత్తింది. ఒక్క రోజులో సుమారు 430 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది.ఈ విపత్తు హైదరాబాద్ పట్టణ ప్రణాళికలో కీలక మలుపుగా మారింది. వరదలకు కారణాలను అధ్యయనం చేసి, భవిష్యత్తులో ఇలాంటి విపత్తులు పునరావృతం కాకుండా చర్యలను సూచించేందుకు అప్పటి హైదరాబాద్ ప్రభుత్వం మైసూరు దివాన్‌గా పనిచేస్తున్న ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆహ్వానించింది.ఆయన సూచనల ఫలితంగా నగరానికి ఎగువ ప్రాంతాల్లో 1920లో ఉస్మాన్ సాగర్, 1927లో హిమాయత్ సాగర్ నిర్మించబడ్డాయి. వీటితో పాటు అనేక చిన్న చెరువులు, కుంటలు, జలాశయాలను అభివృద్ధి చేసి నిర్వహించారు.అధిక వర్షపు నీటిని నిల్వ చేయడం, దాని ప్రవాహాన్ని నియంత్రించడం, మూసీపై ఒత్తిడిని తగ్గించడం ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశం. చెరువులు, కుంటలు, నాలాలు పరస్పరం అనుసంధానమై పనిచేసేవి. ఆధునిక పర్యావరణ ప్రణాళికలో "అర్బన్ వాటర్ రెసిలియెన్స్" అనే భావన ప్రాచుర్యంలోకి రాకముందే హైదరాబాద్ ఒక సమగ్ర పట్టణ జల రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసిందని చెప్పవచ్చు.

**కనుమరుగైన జల వ్యవస్థ**

కాలక్రమేణా ఈ వ్యవస్థ విచ్ఛిన్నమవడం ప్రారంభమైంది. వేగవంతమైన పట్టణ విస్తరణతో చెరువులు, తడిబయళ్లు, నీటి ప్రవాహ మార్గాలు, సహజ డ్రైనేజీ మార్గాలు నివాస కాలనీలు, వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాలకు గురయ్యాయి. ఒక చెరువును మరో చెరువుతో అనుసంధానించే నీటి మార్గాలు కుంచించుకుపోయాయి లేదా పూర్తిగా మూసుకుపోయాయి. చెరువు గర్భాలు, ఫుల్ ట్యాంక్ లెవల్ ప్రాంతాలు, బఫర్ జోన్లలోనూ ఆక్రమణలు పెరిగాయి.రిమోట్ సెన్సింగ్ అధ్యయనాలు హైదరాబాద్ నగర నిర్మిత ప్రాంతం ఎంత వేగంగా విస్తరించిందో వెల్లడించాయి. 1973లో సుమారు 245 చదరపు కిలోమీటర్లుగా ఉన్న నిర్మిత ప్రాంతం 1996 నాటికి 587 చదరపు కిలోమీటర్లకు పెరిగినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. సహజ భూభాగాల స్థానంలో కాంక్రీట్ నిర్మాణాలు పెరగడంతో వర్షపు నీటిని గ్రహించి నిల్వ చేసుకునే నగర సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయింది.హుస్సేన్ సాగర్ ఈ మార్పుకు అత్యంత స్పష్టమైన ఉదాహరణ. ఒకప్పుడు తాగునీటి వనరుగా నిర్మించబడిన ఈ సరస్సు కాలక్రమంలో కాలుష్యం, పట్టణ ఒత్తిళ్ల కారణంగా ఆ పాత్రను కోల్పోయింది. నగరంలోని అనేక జలవనరులు ఆక్రమణలు, కాలుష్యం, నిర్మాణాల కారణంగా వాటి అసలు స్వరూపాన్ని కోల్పోయాయి.దీని ప్రభావం ప్రతి వర్షాకాలంలో కనిపిస్తోంది. హైదరాబాద్‌లో వరదలకు కేవలం భారీ వర్షపాతం మాత్రమే కారణం కాదు; సహజ నీటి ప్రవాహ మార్గాలు మూసుకుపోవడం కూడా ప్రధాన కారణం. గతంలో చెరువులు, నాలాల ద్వారా ప్రవహించిన వర్షపు నీరు ఇప్పుడు భవనాలు, రహదారులు, ప్రహరీ గోడలు, ఇతర నిర్మాణాలను ఎదుర్కొంటోంది. ఫలితంగా కొద్దిసేపు కురిసే భారీ వర్షం కూడా లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతోంది.

**హైడ్రా: ఆక్రమణలపై చర్య**

ఈ నేపథ్యంలో హైడ్రా ప్రాధాన్యత సంతరించుకుంది. కమిషనర్ ఎ.వి. రంగనాథ్ నేతృత్వంలో ప్రభుత్వ భూములు, చెరువులు, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలు, బఫర్ జోన్లు, డ్రైనేజీ మార్గాల్లోని ఆక్రమణలపై సంస్థ చర్యలు చేపట్టింది. ప్రభావవంతమైన వ్యక్తులు, సంస్థలకు సంబంధించిన నిర్మాణాలపై కూడా చర్యలు తీసుకోవడం హైడ్రా చర్యలకు విస్తృత ప్రచారం తెచ్చింది.2026 జూలైలో వెలువడిన నివేదికల ప్రకారం, హైడ్రా రెండేళ్లలో 3,300 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంది. ఈ భూముల విలువ సుమారు రూ.1.5 లక్షల కోట్లుగా అంచనా వేయబడింది. చెరువుల పునరుద్ధరణ, నాలాల్లోని అడ్డంకుల తొలగింపు, ప్రజా స్థలాల రక్షణ వంటి కార్యక్రమాలను కూడా హైడ్రా చేపట్టింది.అయితే హైడ్రా విజయాన్ని కేవలం ఎన్ని నిర్మాణాలను కూల్చింది, ఎన్ని ఎకరాలను స్వాధీనం చేసుకుంది అనే లెక్కలతో మాత్రమే అంచనా వేయకూడదు. తిరిగి స్వాధీనం చేసుకున్న చెరువులు, డ్రైనేజీ వ్యవస్థలు భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలకు గురి కాకుండా రక్షించబడుతున్నాయా? హైదరాబాద్ భవిష్యత్ వరదలను ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతోందా? అనేదే అసలు ప్రశ్న.

**సాంకేతికతతో శాశ్వత రక్షణ**

ఈ లక్ష్యాన్ని సాధించడంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషించగలదు. రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ మ్యాపింగ్, జీపీఎస్ సర్వేలు, వర్చువల్ ఫెన్సింగ్, సీసీటీవీ నిఘా వంటి సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా చెరువుల హద్దులు, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలు, బఫర్ జోన్లను ఖచ్చితంగా గుర్తించి పర్యవేక్షించవచ్చు. శాశ్వత డిజిటల్ రికార్డులు హద్దులను మార్చకుండా నిరోధించడమే కాకుండా, కొత్త ఆక్రమణలు శాశ్వత నిర్మాణాలుగా మారకముందే గుర్తించేందుకు సహాయపడతాయి.

**అభివృద్ధితో పాటు మానవత్వం కూడా అవసరం**

అయితే ఆక్రమణలపై చర్యలు చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించాలి. నోటీసులు, భూ రికార్డులు, రక్షిత ప్రాంతాల గుర్తింపు వంటి అంశాలపై పలువురు ఆస్తి యజమానులు, సంస్థలు న్యాయస్థానాలను ఆశ్రయించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు చట్టబద్ధత, సహజ న్యాయం కూడా సమానంగా ఉండాలి. ముఖ్యంగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో దశాబ్దాలుగా నివసిస్తున్న కుటుంబాల సమస్య అత్యంత సున్నితమైనది. ఉద్దేశపూర్వకంగా చేపట్టిన వాణిజ్య ఆక్రమణలు, భూకబ్జాలపై కఠిన చర్యలు అవసరమైనప్పటికీ, ఆర్థికంగా బలహీన కుటుంబాల పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించాలి.ఇలాంటి ఇళ్లను తొలగించే పరిస్థితి ఏర్పడితే, స్పష్టమైన పునరావాస విధానం లేకుండా వందలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల ఉద్దేశపూర్వక వాణిజ్య ఆక్రమణలు, దీర్ఘకాలంగా నివసిస్తున్న నిరుపేద కుటుంబాల మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాలి. పునరావాసం తప్పనిసరైన సందర్భాల్లో అర్హులైన కుటుంబాలకు ప్రత్యామ్నాయ గృహాలు, తగిన సహాయం అందించే పారదర్శక విధానం ఉండాలి.

**దేశవ్యాప్త సమస్య**

హైదరాబాద్ సమస్య ఒక్క నగరానికే పరిమితం కాదు. బెంగళూరు, ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి నగరాలు కూడా వేగవంతమైన పట్టణీకరణ కారణంగా చెరువులు, సరస్సులు, తడిబయళ్లు, సహజ నీటి మార్గాలను కోల్పోతున్నాయి. దేశవ్యాప్తంగా స్వల్పకాలిక అభివృద్ధి కోసం జలవనరులను ధ్వంసం చేయడం వల్ల నగరాలు వరదలు, నీటి కొరత, పర్యావరణ నష్టాలకు మరింతగా గురవుతున్నాయి.అందువల్ల హైడ్రా ఒక ముఖ్యమైన ప్రయోగం. జలవనరులను పట్టణ అభివృద్ధికి అడ్డంకులుగా కాకుండా కీలక ప్రజా మౌలిక వసతులుగా చూడాలి. చెరువులు, తడిబయళ్లు, నాలాలు వర్షపు నీటిని నిల్వ చేస్తాయి, భూగర్భ జలాలను పెంచుతాయి, వరదలను తగ్గిస్తాయి, జీవవైవిధ్యాన్ని కాపాడతాయి.హైదరాబాద్ దశాబ్దాల పర్యావరణ నిర్లక్ష్యాన్ని సరిదిద్దుకునే అవకాశం ఇప్పుడు ఉంది. అయితే కేవలం బుల్డోజర్లతో నగర పర్యావరణ సమతుల్యతను పునరుద్ధరించడం సాధ్యం కాదు. శాస్త్రీయ ప్రణాళిక, సాంకేతిక పర్యవేక్షణ, రాజకీయ సంకల్పం, పారదర్శక పాలన, కఠినమైన చట్ట అమలు, మానవతా దృక్పథంతో కూడిన పునరావాసం అవసరం.1908 మూసీ వరదలు మనకు అందించిన పాఠం నేటికీ వర్తిస్తుంది. హైదరాబాద్ భవిష్యత్ భద్రత మరిన్ని కాంక్రీట్ నిర్మాణాలపై మాత్రమే ఆధారపడదు. ఒకప్పుడు నగరానికి మొదటి రక్షణ కవచంగా నిలిచిన చెరువులు, కుంటలు, సరస్సులు, సహజ నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించి, వాటిని శాశ్వతంగా రక్షించడంపైనే ఆధారపడి ఉంటుంది.హైడ్రా విజయాన్ని ఎన్ని నిర్మాణాలను కూల్చిందనే దానితో కాదు; హైదరాబాద్ కోల్పోయిన జల రక్షణ వ్యవస్థను ఎంత సమర్థంగా పునరుద్ధరించి, భవిష్యత్ తరాలకు ఎంత సమర్థంగా కాపాడగలిగిందనే దానితోనే కొలవాలి.

# నవీన కాలానికి నవ జాతీయగీతం!

**సదా కొత్తదనాన్ని ఆవాహన చేసుకోవడమే జీవ ధర్మం. మన కాలానికి అవసరమైన ఒక కొత్త జాతీయ గీతాన్ని సృజించాలని యువభారతీయులకు గుల్జార్ పిలుపునిచ్చారు. దేశం 80వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు జరుపుకున్న మరో మూడు రోజులకు గుల్జార్ 92వ ఏట ప్రవేశించారు. 'జనగణమన' లేదా 'వందేమాతరం' స్థానాన్ని భర్తీ చేసేందుకు కాకుండా సమకాలీన విభజనవాద రాజకీయాలను త్రోసిపుచ్చి, జాతిజీవనంలోని అపార వైవిధ్యాన్ని గౌరవించే ఒక అనుబంధ జాతీయ గీతాన్ని సృష్టించాల్సిన అవసరమున్నదని గుల్జార్ విజ్ఞప్తి చేశారు. తాము భారతీయులమనే ప్రగాఢ ఐక్యతా భావాన్ని పెంపొందించే ఒక కొత్త దేశభక్తి గీతాన్ని సృజించుకోవాలని అన్నారు. వర్తమాన భారతదేశం గొప్పదనాన్ని కీర్తించడంలో దశాబ్దాల నాటి పాత పాటలపై ఆధారపడకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. సమకాలీన భారతీయ సమాజంలోని విభిన్న స్వరాలను ప్రతిబింబించేలా జాతీయ అస్తిత్వాన్ని పునర్ నిర్వచించుకోవాలని గుల్జార్ అన్నారు.**




తన కొత్త గీతం 'ఏక్ అకేలా హిందుస్థానీ, దో మిలే తో హిందుస్థాన్' వీడియో విడుదల సందర్భంగా గుల్జార్ ఆ విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి సాంస్కృతిక వైవిధ్యం ద్వారా ఆత్మీయత, ఐక్యతా భావాన్ని శ్రోత మనసులో నెలకొల్పే 'మిలే సుర్ మేరా తుమ్హారా' లాంటి గీతమది. గుల్జార్‌కు ప్రగాఢ అభిమానినే అయినప్పటికీ ఆయన సృజించిన 'ఏక్ అకేలా హిందుస్థానీ' ఇప్పుడు మనకు అవసరమైన కొత్త దేశభక్తి గీతం అని నేను భావించడం లేదు. అలా భావించాలని కవి కూడా కోరుకోలేదు. మన కాలానికి అవసరమైన కొత్త దేశభక్తి గీతాన్ని సృష్టించమని యువ భారతీయులను ఆయన ఆహ్వానించారు.

ఆనందప్రదమైన విషయమేమిటంటే రవీంద్రుని 'జనగణమన' గానీ, బంకించంద్ర 'వందేమాతరం' గానీ తమ ప్రేరణాత్మక గుణాన్ని కోల్పోలేదు, కోల్పోవు కూడా. ఆ అజరామర గీతాల విశిష్ట చారిత్రక ప్రస్థానాన్ని టి.ఎమ్.కృష్ణ తన ఇటీవలి పుస్తకం 'We The People of India: Decoding A Nation's Symbols'లో విపులంగా వివరించారు. నా తరం భారతీయులు 'జనగణమన' వినపడగానే గౌరవపూర్వకంగా లేచి నిలబడేవారు. ఆ ఆచారం కాలం గడుస్తున్న కొద్దీ కొత్త అర్థాలను సంతరించుకున్నది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమింపచేయడంలో ఆ అధికారిక జాతీయ గీతం అశేష ప్రజలకు ఎనలేని స్ఫూర్తినిచ్చింది. బంకించంద్ర 'వందేమాతరం' కూడా అంతే స్ఫూర్తిదాయకమైనది. ఆకాశవాణి విన్పించే 'వందేమాతరం' కాకుండా 'ఆనంద్ మఠ్' సినిమాలోని పాటే నాకు బాగా నచ్చింది. ఈ రెండు గీతాలూ పవిత్రమైనవి, ఉత్కృష్టమైనవి, అన్ని సందర్భాలలోను ఆలాపించేందుకు యుక్తమైనవి.

దేశభక్తి గీతాల పట్ల అనురక్తి, గౌరవభావం నిండుగా వ్యక్తమైన భారతదేశంలో నేను పెరిగాను. ఇక్బాల్ 'సారే జహాన్ సే అచ్ఛా, హిందుస్థాన్ హమారా'ను విస్మరించగలమా? స్వాతంత్ర్యోద్యమం నుంచి మనకు వారసత్వంగా సంక్రమించిన ఉదాత్తగీతమది. భారత జాతీయవాదం సంకుచితమైనదికాదు. మన పొరుగు దేశం, శత్రు రాజ్యం పట్ల వ్యతిరేక భావాలను పురిగొల్పేదికాదు. 'జో జిసాసే మిలా సీఖా హమ్నే/ గైరోంకో భీ అప్నాయ హమ్నే' (కలిసిన ప్రతి ఒక్కరి నుండి నేర్చుకున్నాం, అపరిచితులను కూడా సొంతవారిగా స్వీకరించాం) అన్న విశ్వ దృక్పథంతో మన జాతీయవాదం భారత్‌ను విశిష్టంగా నిర్వచించింది. 1960లు, 1970ల్లోని మా బోటి పిల్లలకు 'ఆవో బచ్చో తుమ్హే దిఖాయే', 'హమ్ లాయేహై తూఫాన్ సే' మొదలైన దేశభక్తిగీతాలు ఆదర్శవంతమైన దేశాన్ని నిర్మించాలని ప్రబోధించాయి. మంచి పౌరులుగా ఎదిగేందుకు అవి స్ఫూర్తినిచ్చాయి. ఇక్బాల్ అజరామర గీతంలోని 'మజ్హబ్ నహీ సిఖాతా ఆపస్ మే బైర్ రఖ్నా' (ఒకరి పట్ల ఒకరు ద్వేషాన్ని పెంచుకోవాలని మతం బోధించదు) అన్న సత్యాన్నే సాహిర్ సుప్రసిద్ధ సినిమా గీతం 'తూ హిందు బనేగా నా ముసల్మాన్ బనేగా, ఇన్సాన్ కీ ఔలాద్ హై ఇన్సాన్ బనేగా' (ఒక బిడ్డకు ఏ మతం ముద్ర వేయకముందే వారు మొదట మనుషులుగా జన్మిస్తారు)లో కూడా ప్రతిధ్వనించింది. 'అప్నీ అజాదీ కో హమ్ హర్గిజ్ మిటా సక్తే నహీ' మొదలైన పాటలు స్వాతంత్ర్యం విలువను ఉద్ఘాటించాయి, 'సాథీ హాత్ బఢానా', 'చోడో కల్ కీ బాతే' మొదలైనవి జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రతి భారతీయుడినీ ఆహ్వానించాయి. తోటి మనుషులకు సేవ చేయడమే దేశాన్ని ఆరాధించడమని నా బాల్యంలో మేము పాడిన దేశభక్తి గీతాలు ఉద్బోధించాయి. ఈ ఉదాత్త భావనే నేను విశ్వసించే జాతీయవాదం. 1962, 1965, 1971 యుద్ధాల చరిత్ర ఆధారంగా నిర్మించిన సినిమా గీతాలు 'ఆయే మేరే వతన్ కే లోగో', 'కర్ చలే హమ్ ఫిదా' మొదలైన గీతాలు కూడా ఉదాత్త దేశభక్తిని ప్రేరేపించాయి గానీ సంకుచిత జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టలేదు. మనోజ్‌కుమార్ ప్రాచుర్యంలోకి తెచ్చిన దేశభక్తి కూడా నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చింది. అది నిరాడంబర దేశభక్తి. మా చిన్నతనంలో సినిమాలు చూడడానికి మా పెద్దలు అనుమతించేవారు కాదు. ప్రస్తావిత గీతాలు అన్నిటినీ తెరపై చూడడం కంటే రేడియో ద్వారానే ఎక్కువగా వింటుండేవాళ్లం. ఇప్పటి దేశభక్తిగీతాలు నాకు అంతగా స్ఫూర్తినివ్వడం లేదు. వాటితో మమేకం కాలేకపోతున్నాను. ఆస్వాదించలేకపోతున్నాను. రాజకీయ స్పృహతో రాసిన కవిత్వం అర్థవంతమైనది. అటువంటి కవితలను తరచు చదువుతుంటాను. ప్రసిద్ధ కవి రఘువీర్ సహాయ్ వ్యంగ్య కవిత 'అధినాయక్' స్వాతంత్ర్యానంతరం కూడా సామాన్య ప్రజల దుస్థితి మారలేదని అధిక్షేపించింది. వినోద్ కుమార్ శుక్లా 'లగ్భగ్ జైహింద్' దేశభక్తి సూత్రాలకు, వాస్తవ మానవ శ్రేయస్సుకు మధ్య ఉన్న అంతరాన్ని బహిర్గతం చేసింది. సర్వేశ్వర్ దయాళ్ సక్సేనా, దుష్యంత్ కుమార్ కవితలు ప్రజల నిరాశా నిస్పృహలను ప్రభావశీలంగా వ్యక్తం చేశాయి. ఉదాత్త దేశభక్తిగీతాల కోసం నా అన్వేషణ నన్ను ఫైజ్ అహ్మద్ ఫైజ్, ఇక్బాల్ బానో కవిత్వానికి తీసుకువెళ్లాయి. జనప్రియ హిందీ గీతాలు, పాటలకు నా పఠనాసక్తులలో చోటు లేదు. అలా అని నేను వాటిని వినకపోలేదు. 'చక్ దే ఇండియా' నా హృదయాన్ని తాకింది. 'సందేశే ఆతే హై' స్ఫూర్తిదాయక గీతమే కానీ 'కర్ చలే హమ్ ఫిదా'లా భావావేశం కలిగించేది కాదు. 'యే జో దేశ్ హై తేరా' అనుభూతించడానికి అవసరమైన ప్రవాస జీవితానుభవాలు నాకు లేవు. 'మా తుఝే సలామ్' సంగీత బాణీ అత్యాధునికంగా ఉంటుంది. అయితే ఆ చరణాలలోని భాష పాత శైలిలో ఉంటుంది. దాని సందేశం కూడా గతించిన కాలపు దేశభక్తి ప్రపూరితంగా ఉంటుంది. ఈ రీతికి 'రంగ్ దే బసంతి' కొంచెం మినహాయింపు. దేశభక్తి, ప్రభుత్వ విధేయత మధ్య తేడాను ఈ గీతం స్పష్టంగా ఎత్తి చూపుతుంది. సరే, గత ఒక దశాబ్ద కాలంలో 'తేరీ మిట్టీ', 'చల్లా' మొదలైన పాటలు బాగా ప్రజాదరణ పొందాయి. తీవ్ర జాతీయవాదాన్ని ప్రబోధించే ఆ పాటలు నా చిన్ననాటి మానవీయ జాతీయవాదానికి భిన్నమైనవి, విరుద్ధమైనవి.

కొత్త దేశభక్తి గీతాన్ని సృజించాలని యువ భారతీయులకు గుల్జార్ ఇచ్చిన పిలుపు సమయోచితమైనది. అయితే స్వాతంత్ర్య శతాబ్దికి వడివడిగా పురోగమిస్తోన్న భారత్‌కు అవసరమైన జాతీయ గీతాన్ని సృష్టించేందుకు సాహిత్య ప్రతిభ, సంగీత మేధస్సు మాత్రమే సరిపోవు. భారత్ భావనకు ఒక కొత్త నిర్వచనమిచ్చే దార్శనికత అవసరం. నేటి సంకుచిత జాతీయవాద దృక్కోణాలను విడనాడి ప్రతి పౌరుడిని గౌరవించే మానవత, సమ్మిళిత దృక్పథాన్ని కొత్త దేశభక్తి గీతం విస్పష్టంగా ఆవిష్కరించాలి. అటువంటి స్ఫూర్తిదాయక జాతీయ గీతమే భారతదేశాన్ని పునః సృష్టించగలుగుతుంది. దళితులు ఆదివాసులు, మహిళలు, మైనారిటీలతో సహా సమస్త అణగారిన వర్గాలవారు ఒక వినూత్న చైతన్యంతో తమ గళాలను విన్పిస్తున్న కాలమిది. జాగృతమవుతున్న నవభారత వాణిలో వారి గొంతుకలు ప్రతిధ్వనించకపోతే ఎలా? నవ భావ భారతం తేజరిల్లాలన్నా, విస్తరిల్లాలన్నా ఇప్పటివరకు విస్మరణకు గురైన సామాజికవర్గాల వాణికి సముచిత న్యాయం చేయాలి.



# విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా ఉచిత వైద్య సేవలు

- లయన్స్ క్లబ్ హైదరాబాద్ దక్కన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం
- శ్రీనివాస ఆసుపత్రి వైద్యులచే విద్యార్థులకు వైద్య పరీక్షలు

**చంపాపేట్, ఆగస్టు 29 (అనంత జనశక్తి)**

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని లయన్ డాక్టర్ రాజగోపాల్ రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ హైదరాబాద్ దక్కన్ ఆధ్వర్యంలో శ్రీనివాస ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఏకలవ్య పాఠశాల విద్యార్థుల కోసం శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శ్రీనివాస ఆసుపత్రి వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన ఆరోగ్య సూచనలు అందించారు.ఈ సందర్భంగా లయన్ డాక్టర్ రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలను అందించడంలో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.కార్యక్రమంలో లయన్ బండారి ప్రభాకర్, లయన్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, లయన్స్ క్లబ్ హైదరాబాద్ దక్కన్ అధ్యక్షుడు లయన్ వెంకటేశ్వర్ రెడ్డి, కార్యదర్శి లయన్ మనీషా, లయన్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు. ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్, బోధనా, సహాయక సిబ్బంది అందించిన సహకారంతో వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు ఎస్ ఎన్ కార్ డెకర్స్ చంపాపేట్ యజమాని వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

# తుక్కుగూడలో దారుణం

- ప్రైమ్ కేర్ ఆస్పత్రిలో నర్సు శిరీష అనుమానాస్పద మృతి
- తుక్కుగూడ ప్రైమ్ కేర్ లో కలకలం
- రంగంలోకి దిగిన శంషాబాద్ డిసిపి మహేశ్వరం

**మహేశ్వరం ఆగస్టు 29 ( అనంత జనశక్తి)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రముఖ ప్రైమ్ కేర్ ప్రైవేట్ హాస్పిటల్ లో విధులు నిర్వహిస్తున్న నర్సు శిరీష (పేరు మార్పు ఉండవచ్చు) అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. శుక్రవారం సాయంత్రం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. హాస్పిటల్ లోనే నర్సు విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించిన తోటి సిబ్బంది యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. విషయం కాస్తా బయటకు పొక్కడంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

**పోలీసుల హుటాహుటిన దర్యాప్తు:**
సమాచారం అందుకున్న వెంటనే మహేశ్వరం పోలీసులు, ఆదిభట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పంచనామా చేసి, హాస్పిటల్ సిబ్బందిని విడివిడిగా విచారిస్తున్నారు.ఘటన తీవ్రతను గమనించి శంషాబాద్ డీసీపీ రాజేష్ స్వయంగా ఆస్పత్రికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. ఆస్పత్రి యాజమాన్యం పాత్రపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

**అన్ని కోణాల్లో విచారణ:** మృతురాలు శిరీష గత కొంతకాలంగా ప్రైమ్ కేర్ హాస్పిటల్ లో నర్సుగా పని చేస్తున్నట్లు ప్రాథమికంగా తేలింది. అయితే ఆమె మృతికి గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదు. ఇది ఆత్మహత్యా? లేక ఎవరైనా హత్య చేసారా? తోటి సిబ్బందితో విభేదాలు ఉన్నాయా? వ్యక్తిగత కారణాలా? లేక యాజమాన్య వేధింపులా? అనే అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాతే అసలు మృతికి గల కారణం వెల్లడవుతుందని పోలీసులు తెలిపారు.ప్రస్తుతం తుక్కుగూడలో ఈ ఘటన హాట్ టాపిక్ గా మారింది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిబ్బంది భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



# రావిర్యాల రైతులను నట్టేట ముంచిన నక్షా బాట వివాదం

- సర్వే నెం.289 లోని పురాతన బాటను ధ్వంసం
- పొలాలకు వెళ్లలేక కొంగర ఖుర్దు రైతుల ఆందోళన
- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని నక్షా బాటను పునరుద్ధరించాలని రైతుల వినతి

**మహేశ్వరం, ఆగస్టు 29,( అనంత జనశక్తి )**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కొంగరకుర్దు గ్రామంలో రైతుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పురాతన కాలం నుండి రైతులు ఉపయోగిస్తున్న నక్షా బాటను గుర్తించలేని విధంగా ధ్వంసం చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామానికి చెందిన రైతులకు సర్వే నంబర్లు 295, 294, 296, 297, 497, 28, 498 లలో వ్యవసాయ భూములు ఉన్నాయి. ఈ భూములకు వెళ్లడానికి సర్వే నంబర్ 289 గుండా వెళ్లే నక్షా బాటను ఎన్నో ఏళ్లుగా రైతులు ఉపయోగిస్తున్నారు. ఈ బాట ద్వారా ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు, పశువుల రాకపోకలు సులువుగా సాగేవి.
అయితే ఇటీవల సర్వే నంబర్లు 291 మరియు 292 లో భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు ఆ బాటను చదును చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. అనంతరం ఆ బాటపై ఎవరో కంప్లైంట్ ఇచ్చారనే సాకుతో రెవెన్యూ అధికారులు ఏకంగా ఆ పురాతన నక్షా బాటను పూర్తిగా ధ్వంసం చేశారని బాధిత రైతులు వాపోతున్నారు.బాట ధ్వంసం కావడంతో ప్రస్తుతం తమ పొలాల్లోకి వెళ్లడానికి దారి లేకుండా పోయిందని, తమ పొలాల్లో ఉన్న బర్రెలు,ఇతర పశువులకు గడ్డి తీసుకెళ్లడానికి, వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్లు, ఇతర వాహనాలు తీసుకెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించాలని రైతులు కోరుతున్నారు. రెవెన్యూ రికార్డులు, పాత నక్షా మరియు క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించి, పురాతన కాలం నుండి ఉన్న నక్షా బాటను గుర్తించి,దానిని పునరుద్ధరించి రైతుల రాకపోకలకు శాశ్వతంగా అందుబాటులోకి తేవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులతో స్థల పరిశీలన జరిపి తక్షణ పరిష్కారం చూపాలని కొంగరకుర్దు గ్రామ బాధిత రైతులు వేడుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో అలేటి బావయ్య, కోటగళ్ళ రాజ్ కుమార్, కోటగళ్ల బాల్ రాజ్,నిమ్మ దామోదర్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లైన రెండు నెలలకే భర్తతో గొడవ

- బాంబే నుంచి ఇల్లు వదిలి రైల్లో పారిపోతున్న నవ వధువు
- ఎట్టకేలకు అనంతపురం ఆర్.పీ.ఎఫ్ పోలీసులకు చిక్కి..
- సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగింత

**అనంతపురం ఆగస్ట్ 29,అనంత జనశక్తి న్యూస్**



ఎన్నో ఆశలతో అత్తారింట అడుగుపెట్టిన ఓ నవ వధువుకు అంతలోనే అక్కడ ఏ కష్టమొచ్చిందో ఏమో భర్తతో గొడవపడింది. కాపురం చేయడం ఇష్టం లేక ఇల్లు వదిలి బాంబే నుంచి రైలులో పారిపోతుండగా అనంతపురం ఆర్పీఎఫ్ పోలీసులకు పట్టుబడింది. వివరాలు తెలుసుకున్న పోలీసులు మహిళా పోలీసుల సంరక్షణలో ఆమెను ఉంచి మరుసటి రోజు కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. ఆర్పీఎఫ్ సీఐ సుధాకర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. ముంబైలోని ఓ ప్రభుత్వ శాఖలో ఉన్నత స్థాయిలో పని చేసే కైలాష్ చంద్రకాంత్ భల్సింగ్ అనే అధికారికి రెండు నెలల కిందట శీతల్ బాలసాహెబ్ ఉగలే(22) తో వివాహమైంది. అయితే అక్కడ అగుడు పెట్టినప్పటి నుంచి తరచూ గొడవలు మొదలయ్యాయి. దీంతో విసుగెత్తిన ఆమె ఇంటి నుంచి ఎటైనా వెళ్లిపోవాలనుకుంది. వెంటనే ముంబై నుంచి బెంగళూరుకు బయలుదేరిన రైలు ఎక్కింది. దీంతో కంగారుపడ్డ కుటుంబ సభ్యులు ముంబై పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు పెట్టారు. అక్కడి పోలీసులు అన్ని రైల్వే స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. ఇందులో భాగంగా గుంతకల్లు సెక్యూరిటీ కంట్రోల్ కు సమాచారం రాగా, వారిచ్చిన ఆదేశాల మేరకు అనంతపురం ఆర్పీఎఫ్ పోలీసులు ముంబై రైలు శుక్రవారం అర్ధరాత్రి అనంతపురం చేరుకోగానే తనిఖీ చేశారు. ఎట్టకేలకు శీతల్ ను గుర్తించారు. మహిళా హెడ్ కానిస్టేబుల్ ఉషారాణి, కానిస్టేబుల్ ఆశా పవర్ సంరక్షణలో ఆమెను ఉంచారు. ఆమెకు సీఐ సుధాకర్ రావు కౌన్సెలింగ్ ఇచ్చారు. ముంబైలోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు అనంతపురానికి శనివారం చేరుకోగా.. ఆధారాలన్నీ పరిశీలించాక శీతల్ ను సురక్షితంగా అప్పగించారు. కుటుంబ సభ్యులు ఆమెను తమవెంట తిరిగి ముంబై పిలుచుకొని వెళ్లారు. అనంతపురం ఆర్పీఎఫ్ పోలీసులకు శీతల్, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# గండి వీరాంజనేయ స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

- మూడో శ్రావణ శనివారం 6 వేల మందికి అన్నప్రసాదం
- ప్రత్యేక పూజలు, పటిష్ట ఏర్పాట్లు

**చక్రాయపేట/పులివెందుల**
**ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్**



పవిత్ర శ్రావణమాసం సందర్భంగా గండి శ్రీ వీరాంజనేయ స్వామి క్షేత్రం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. శ్రావణమాసంలోని మూడో శనివారం స్వామివారిని దర్శించుకుంటే శుభం కలుగుతుందనే దృఢమైన విశ్వాసంతో కడప జిల్లాతో పాటు అన్నమయ్య జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో గండి క్షేత్రానికి తరలి వచ్చారు.మూడో శ్రావణ శనివారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల కోసం ఉదయం 4.30 గంటల నుంచే స్వామివారి దర్శన సౌకర్యాన్ని కల్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.
భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఆధ్వర్యంలో క్యూ లైన్ల వద్ద తాగునీటి సౌకర్యం, ఉచిత అన్నప్రసాదం వంటి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సుమారు 6,000 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించింది.
వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి భక్తులకు అవసరమైన వైద్య సేవలను అందించారు. అలాగే
గండి వీరాంజనేయ స్వామివారిని దర్శించుకునేందుకు మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవీంద్రారెడ్డి), ఆయన సోదరులు జోగిరెడ్డి, భారత్ రెడ్డి తదితరులు విచ్చేశారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా
శాశ్వత నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు విరాళాలు అందించారు.
పెద్ది వీడు, రాయచోటికి చెందిన నారాయణ-జయమ్మ దంపతులు రూ.50,000 స్కానర్ ద్వారా విరాళంగా అందించారు.
అన్నమయ్య జిల్లాకు చెందిన రామపాటి శ్రీనివాసులు-జ్యోతి దంపతులు రూ.30,000 నగదు రూపంలో అందించారు.
యర్రగుంట్లకు చెందిన ప్రసాద్ రెడ్డి-మాధవి దంపతులు అన్నదానం పీఓఎస్ ద్వారా రూ.25,000 విరాళం అందించారు.
స్వామివారి హుండీ, ప్రసాదాల ఆదాయం
మూడో శ్రావణ శనివారం సందర్భంగా స్వామివారి దేవస్థానానికి వివిధ మార్గాల ద్వారా గణనీయమైన ఆదాయం సమకూరింది.
అర్జిత సేవ టికెట్ల ద్వారా: రూ.3,61,186
లడ్డూ ప్రసాదం ద్వారా: రూ.9,04,500
పులిహోర ప్రసాదం ద్వారా: రూ.73,000
ప్రత్యేక దర్శనం ద్వారా: రూ.2,48,520
తాత్కాలిక హుండీల ద్వారా: రూ.6,86,311
తాత్కాలిక షాపుల ద్వారా: రూ.21,490
శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా గండి క్షేత్రానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక సందడితో కళకళలాడాయి. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడం పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# ప్రసన్నాయపల్లి క్రాస్‌కు బదులుగా అయ్యావారిపల్లి–నాయక్‌నగర్ వద్ద అండర్‌పాస్ ఏర్పాటు చేయాలి

- ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజల డిమాండ్

**రాప్తాడు, ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్:**

అయ్యావారిపల్లి-నాయక్‌నగర్ క్రాస్ వద్ద వాహనాల అండర్‌పాస్ (వీయూపీ) ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో గతంలో పలు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా అండర్‌పాస్ ఏర్పాటు అత్యవసరమని వారు పేర్కొంటున్నారు.అయ్యావారిపల్లి, బుక్కచెర్ల, జి.కొత్తపల్లి, గాండ్లపర్తి, వరిమడుగు, పాలచెర్ల, బొగినేపల్లి తదితర గ్రామాల ప్రజలు వివిధ అవసరాల కోసం ఈ మార్గం మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా కలెక్టరేట్, రైల్వే స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ముఖ్య ప్రాంతాలకుi వెళ్లేందుకు ఈ మార్గం కీలకంగా ఉందని తెలిపారు.ప్రస్తుతం అయ్యావారిపల్లి-నాయక్‌నగర్ క్రాస్ వద్ద రహదారి దాటేందుకు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనన్న భయం నెలకొంటోందన్నారు.ప్రసన్నాయపల్లి క్రాస్ వద్ద వాహనాల అండర్‌పాస్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు బదులుగా అయ్యావారిపల్లి-నాయక్‌నగర్ క్రాస్ వద్ద వీయూపీ ఏర్పాటు చేస్తే అనేక గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని వారు పేర్కొన్నారు. ఇక్కడ అండర్‌పాస్ నిర్మిస్తే రహదారి దాటే సమయంలో ప్రమాదాలను తగ్గించడంతో పాటు ప్రజలకు సురక్షితమైన రాకపోకల సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.ప్రజల ప్రాణ భద్రత, ప్రయాణ సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారుల అధికారులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా స్పందించి అయ్యావారిపల్లి-నాయక్‌నగర్ క్రాస్ వద్ద వీయూపీ ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.



# మణుగూరు ఏరియాను సందర్శించిన జీఎం ఎన్. చక్రవర్తి

ఆర్థిక క్రమశిక్షణతోనే సంస్థకు ఉజ్వల భవిష్యత్తు

**మణుగూరు, ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్ :**



సింగరేణి జీఎం (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) ఎన్. చక్రవర్తి శనివారం మణుగూరు ఏరియాను సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ డి. వెంకట రామారావు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ సింగరేణిలో సుదీర్ఘకాలం వివిధ హోదాల్లో పనిచేసి సంస్థ అభివృద్ధికి సేవలందించినట్లు తెలిపారు. ప్రస్తుతం జీఎం (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్)గా బాధ్యతలు నిర్వహిస్తున్న తాను ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నట్లు పేర్కొన్నారు.
సింగరేణి సంస్థ భవిష్యత్తుకు ఆర్థిక క్రమశిక్షణ ఎంతో అవసరమని అన్నారు. ఆర్థిక వనరులను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు అనవసర ఖర్చులను నియంత్రించాలని సూచించారు. సంస్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు, ఉద్యోగులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కోరారు. మణుగూరు ఏరియా అభివృద్ధికి ఉద్యోగులు, కార్మిక నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచేందుకు సమిష్టి కృషి అవసరమని తెలిపారు. అందరూ ఐక్యంగా పనిచేసినప్పుడే సింగరేణిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లగలమని పేర్కొన్నారు. ఇన్‌చార్జి జీఎం వెంకట రామారావు మాట్లాడుతూ చక్రవర్తి సింగరేణిలో వివిధ హోదాల్లో నిబద్ధతతో పనిచేసి విశిష్ట సేవలందించారని కొనియాడారు. ముఖ్యంగా ఆర్థిక వ్యవహారాల్లో ఆయన సేవలు ప్రశంసనీయమని అన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో గడపాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో ఏజీఎం (ఐఈడీ) సి.హెచ్. రాంబాబు, ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్, ఏరియా ఇంజనీర్ వి. మధన్ నాయక్, పీవోఎంజీసీ ఈ. శ్రీనివాస్, క్వాలిటీ విభాగం అధికారి నాగరమేష్, డీజీఎం (సర్వే) ఎల్. దయాకర్, డీజీఎం (సివిల్) జి. శివప్రసాద్, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేష్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. చక్రవర్తి పదవీ విరమణ జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని వారు ఆకాంక్షించారు.

# బాధితులను ఆదుకోండి

- అత్యవసర సేవలు అందించండి
- మోదీకి మల్లికార్జున ఖర్గే లేఖ

**న్యూఢిల్లీ, ఆగస్టు 29, అనంతజనశక్తి న్యూస్**

నేపాల్‌లో సంభవించిన విధ్వంసకర వరదలపై కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. నేపాల్‌లో భారీ వరదల కారణంగా పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందని ఖర్గే పేర్కొన్నారు. వరదల కారణంగా 500 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, దాదాపు 1,000 మందికి పైగా గల్లంతైనట్లు ఖర్గే తన లేఖలో తెలిపారు. వేలాది మంది ప్రజలు ఆహారం, మందులు, నివాసం, ఇతర అత్యవసర సదుపాయాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం నేపాల్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని బాధితులకు అవసరమైన మానవతా, సహాయక చర్యలను అందించాలని ఖర్గే కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసి, బాధితులకు అవసరమైన ఆహారం, మందులు, నివాసం వంటి అత్యవసర సదుపాయాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వరదల కారణంగా నేపాల్‌లోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు, భారతీయ మూలాలున్న వ్యక్తులు కూడా చిక్కుకుపోయారని ఖర్గే తెలిపారు. వారిని గుర్తించి సురక్షితంగా భారత్‌కు తరలించేందుకు రెస్క్యూ, తరలింపు చర్యలను ముమ్మరం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నేపాల్‌లో నెలకొన్న విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం వేగంగా స్పందించి సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఖర్గే తన లేఖ ద్వారా స్పష్టం చేశారు. బాధిత ప్రజలకు మానవతా దృక్పథంతో అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరారు.



## పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో సయ్యద్ జావిద్ పాషా ఘన విజయం

**నాగార్జునసాగర్, ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్:**

తోటి పోలీసు సిబ్బంది పట్ల ఆప్యాయతతో మెలుగుతూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సయ్యద్ జావిద్ పాషా నల్గొండ జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2026 ఎన్నికల్లో నాగార్జునసాగర్ సర్కిల్ తరఫున ఘన విజయం సాధించారు. విజయపురి టౌన్, పెద్దవూర, తిరుమలగిరి సాగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలీసు సిబ్బంది జావిద్ పాషాకు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించడంతో ఆయన విజయానికి బాటలు పడ్డాయి. తనపై తోటి సిబ్బంది ఉంచిన నమ్మకమే ఈ విజయానికి కారణమని జావిద్ పాషా పేర్కొన్నారు.ఎన్నికల్లో విజయం సాధించి నాగార్జునసాగర్ సర్కిల్‌కు పేరు తీసుకొచ్చిన జావిద్ పాషాను పట్టణ ఎస్ఐ సతీష్ శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా జావిద్ పాషాకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎస్ఐ సతీష్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని జావిద్ పాషాకు శుభాకాంక్షలు తెలిపారు.

## సెప్టెంబర్ 1న ఐఎఫ్‌టీయూ జిల్లా సదస్సు




### కార్మిక సమస్యల పరిష్కారానికి పోరాటం ఉధృతం చేయాలి

**గుండాల, ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్:**

సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలనే లక్ష్యంతో సెప్టెంబర్ 1న కొత్తగూడెంలో నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగపాణి, గుండాల ఏరియా కమిటీ కార్యదర్శి యాసారపు వెంకన్న పిలుపునిచ్చారు. సదస్సుకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరుతూ శనివారం గుండాల మండల కేంద్రంలో గ్రామపంచాయతీ, బీఓసీ, హమాలీ, కేజీబీవీ, మిషన్ భగీరథ తదితర రంగాల కార్మికుల వద్ద విస్తృత ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు కల్పించడంతో పాటు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సంక్షేమ హక్కులు అమలు చేయడంలో ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను మరింత మెరుగుపరచాలని కోరారు. హమాలీ, మోటార్ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆదాయం కోల్పోయిన ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి నెలకు రూ.10 వేల జీవనభృతి అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సెప్టెంబర్ 1న కొత్తగూడెంలో నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ జిల్లా సదస్సుకు ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్, రైతు స్వరాజ్య వేదిక అధ్యక్షుడు కన్నెగంటి రవి తదితరులు హాజరై ప్రసంగించనున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం జరిగే ఈ సదస్సుకు అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కొక్కు సారంగపాణి, యాసారపు వెంకన్న కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఏరియా కమిటీ నాయకులు గడ్డం నాగేష్, బానోతు చంద్యా, చేబోతు రవి, మెంతిని నాగేష్, చింత నర్సన్న, సట్టు ధనరాజ్, ఆవుల సదానందం, మాచర్ల రాకేష్, కొండ్రు శైలజ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువత భవిష్యత్తుతో చెలగాటం ఆపాలి

**- ఖాళీ పోస్టులు భర్తీ చేసి ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలి**

**- ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతి.. యువతకు ఉపాధి కల్పించాలి**

**గుండాల, ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్:**

నిరుద్యోగ యువత భవిష్యత్తుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడకుండా తక్షణమే ఖాళీ పోస్టులను భర్తీ చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రగతిశీల యువజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పూణే మంగయ్య, కోర్సా రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం గుండాల మండలం కాంచనపల్లిలో జరిగిన ఇల్లందు డివిజన్ జనరల్‌బాడీ సమావేశంలో వారు మాట్లాడారు.ప్రభుత్వ శాఖల్లోని అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయడంతో పాటు ప్రతి ఏడాది ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించి నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం నియామకాలు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయ, వైద్య, పోలీస్, రెవెన్యూ, విశ్వవిద్యాలయ శాఖల్లో ఖాళీలను అత్యవసరంగా భర్తీ చేయాలని, నియామక పరీక్షలను సకాలంలో నిర్వహించి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేసి కొత్త ఉద్యోగాలు సృష్టించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి అందించాలని, పరిశ్రమల స్థాపన ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడటమే కాకుండా ఉపాధి హక్కు, ఖాళీ పోస్టుల భర్తీ కోసం యువత సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ హక్కుల సాధన కోసం యువత ఐక్యంగా పోరాడాలని సూచించారు. ఇల్లందు డివిజన్ నూతన కమిటీ ఎన్నిక సమావేశంలో ప్రగతిశీల యువజన సంఘం ఇల్లందు డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వుకే శ్రవణ్, కార్యదర్శిగా వెలుగు శాంతారావు, ఉపాధ్యక్షుడిగా ధారావత్ సుందర్, సహాయ కార్యదర్శిగా కల్తి సుదర్శన్, కోశాధికారిగా బానోత్ సురేందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చంద్రశేఖర్, భయ్యా ఎంకన్న, చందావత్ లక్ష్మణ్, గంగావత్ జగదీష్, దారావత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# గోదావరి పుష్కరాలకు ఘాట్ల నిర్మాణాలు ప్రారంభం

**- రూ.49 కోట్లతో మూడు దశల్లో పనులు.. వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్ :**




భద్రాచలంలో 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. పుష్కర ఘాట్ల నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ నిర్వహించి శ్రీకారం చుట్టారు. జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథులుగా పాల్గొని వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జేసీబీతో మట్టి తీసి పనులను ప్రారంభించారు.

గోదావరి పరివాహక ప్రాంతంలో పుష్కర ఘాట్ల నిర్మాణాలను మూడు దశల్లో చేపట్టనున్నారు. తొలి దశ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.46.65 కోట్లు కేటాయించగా.. రెండో దశకు రూ.1.75 కోట్లు, మూడో దశకు రూ.60 లక్షలు మంజూరయ్యాయి. మొత్తంగా రూ.49 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ అంకిత్ తెలిపారు. వచ్చే ఏడాది మార్చిలోగా అన్ని పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

మొదటి దశలో భద్రాచలంలో పుష్కర ఘాట్ల పనులు చేపట్టి.. అనంతరం దుమ్ముగూడెం మండలం పర్ణశాల, బూర్గంపాడు మండలం మోతేపట్టినగర్ ప్రాంతాల్లో నిర్మాణాలు కొనసాగనున్నాయి. ములుగు జిల్లాలోని చిన్నరావిగూడెం, రామానుజావరం, రామచంద్రాపురం ప్రాంతాల్లోనూ పుష్కర ఘాట్ల పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు,స్నాన ఘాట్లు, మరుగుదొడ్లు, సర్వీస్ రోడ్డు పకడ్బందీగా ఏర్పాటు చేయాలి. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో 2027 జూన్, జూలైలో జరిగే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అధికారులను ఆదేశించారు. వాజేడు, వెంకటాపురం ప్రాంతాల్లోనూ పుష్కర ఘాట్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి, మరమ్మతు పనులు రూ.351 కోట్లతో కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. పనులను కలెక్టర్, అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వేగవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. పుష్కర పనులను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

భద్రాచలం కరకట్ట ప్రాంతంలో సర్వీస్ రోడ్డు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ప్రణాళిక రూపొందించాలని కోరారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తుల కోసం స్నాన ఘాట్లు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులను పకడ్బందీగా కల్పించాలని సూచించారు. భద్రాచలం ప్రాంతాన్ని తెలంగాణ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుతుందని ఎమ్మెల్యే తెలిపారు . ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో దామోదర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఈ మహేశ్వరరావు, డీఈ భాగ్యరాజ్ రాథోడ్, ఈఈ జానీ, భద్రాచలం సర్పంచ్ పునేం కృష్ణ, పంచాయతీ ఈవో శ్రీనివాస్, తహసీల్దార్ రవి, వార్డు సభ్యులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

**మణుగూరు, ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్ :**




సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మణుగూరులోని సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఏఐటీయూసీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌లుగా రూపొందించేందుకు ప్రయత్నిస్తోందని, దీనిని కార్మిక వర్గం పూర్తిగా వ్యతిరేకిస్తూ ఉద్యమించాల్సిన అవసరం ఉందని పుల్లారెడ్డి అన్నారు. కార్మిక హక్కులు, సంక్షేమం కోసం ఏఐటీయూసీని మరింత బలోపేతం చేయాలని, కార్మికులకు అండగా నిరంతరం పోరాటాలుbకొనసాగించాలని పిలుపునిచ్చారు. దేశంలో పోరాటాల చరిత్ర కలిగిన సంఘం ఏఐటీయూసీ మాత్రమేనని పేర్కొన్నారు.

కార్మిక రంగ సంక్షేమానికి ఏఐటీయూసీ విశేష కృషి చేసిందని, కార్మిక హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతూ వారి అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మున్నా లక్ష్మీకుమారి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఏఐటీయూసీలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ సభ్యత్వం నమోదు చేసుకుని సంఘం, ప్రజా సంఘాల నిర్మాణాన్ని బలోపేతం చేయాలని అన్నారు. రాష్ట్ర మహాసభలకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ

కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కొత్తపల్లి సీతారాములు అధ్యక్షత వహించగా, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, ఏఐటీయూసీ నాయకులు తోట రమేష్, బోసెట్టి సంపత్, సిరిగద్దె సతీష్, ఎస్.డి. యాకూబ్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్ :**




ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలని, ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులోగా విచారణ చేపట్టాలని సూచించారు. సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని, నోటీసులు అందజేసిన రోజు నుంచి ఏడు రోజుల గడువు పూర్తైన అనంతరం విచారణ నిర్వహించాలని సూచించారు. అనామలీస్, నో మ్యాపింగ్ జాబితాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా సంబంధిత వ్యక్తులు సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజువారీగా నోటీస్ బోర్డుపై నవీకరించాలని, ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ఈ ప్రక్రియ కోసం నియమించిన ఏఈఆర్ఓలకు అవసరమైన శిక్షణ అందించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించి నోటీసులు జారీ చేసి, యాప్‌లో వివరాలను నవీకరించినట్లు తెలిపారు. నోటీసుల విచారణ ప్రక్రియను పూర్తి చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రక్రియను నిర్వహించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన డీఎస్పీ అరుణ్ కుమార్

**- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 29, అనంత జనశక్తి న్యూస్ :**



వార్షిక తనిఖీల్లో భాగంగా భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ శనివారం భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించి, సిబ్బంది విధుల నిర్వహణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన డీఎస్పీ, ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. భద్రాచలం పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు నిరంతరం చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్, దేవాలయాల పరిసరాల్లో ట్రాఫిక్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్ 2.0లో ఎప్పటికప్పుడు సక్రమంగా అప్‌డేట్ చేయాలని తెలిపారు. బ్లూకోల్ట్స్ వాహనాలతో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయాలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే నియంత్రించాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని డీఎస్పీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ తిరుపతి, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎంబీబీఎస్ విద్యార్థిని ఆత్మహత్య

# నేడు నీట్ పీజీ పరీక్ష

**- ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో విషాదం**

**- విషం తాగి బలవన్మరణానికి పాల్పడింది**

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**



నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో విషాదం నెలకొంది. నీట్ పీజీ అభ్యర్థిని ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని అపరాజిత హాస్టల్‌లో ఉంటూ నీట్ పీజీకి ప్రిపేర్ అవుతున్న యువతి విషం తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఆదివారం నీట్ పీజీ పరీక్ష అనగా.. మనస్తాపంతో కర్నూలుకు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని యశ్విత ప్రాణాలు తీసుకుంది. గత ఆరు నెలలుగా యువతి హైదరాబాద్‌లో ఉంటూ 'నీట్ పీజీ' పరీక్షకు ప్రిపేర్ అవుతోంది. మృతురాలు కర్నూలుకు చెందిన ప్రముఖ వ్యాపారి రామ్మోహన్ రెడ్డి ఏకైక కుమార్తె. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విద్యార్థిని మృతిపై కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఒక్కగానొక్క కూతురు మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరీక్షల మానసిక ఒత్తిడే యువతి ఆత్మహత్యకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆదివారం | రంగారెడ్డి
30.08.2026
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
07



# నడుము సైజ్ పెరిగి బట్టలు టైట్‌గా మారాయా, కోచ్ చెప్పిన ఫుడ్స్ తింటే చాలా వరకూ ఫ్యాట్ తగ్గుతుంది

నడుము భాగం లావుగా మారితే చూడ్డానికి ఎదుటివారి చూపు మొత్తం నడుముపైనే ఉంటుంది. అప్పర్ బాడీ మొత్తం సన్నగానే ఉంటుంది. లోయర్ బాడీ మాత్రమే లావుగా మారి బట్టలు సరిగ్గా సెట్ కావు. వీరిని సాధారణంగా పియర్ షేప్ బాడీ అంటారు. ఇది కూడా ఒక్కొక్కరికి ఒక్కోలా ఉంటుంది. కొంతమందికి నడుము మాత్రమే లావుగా ఉంటే, మరికొంతమందికి నడుము, తొడలు కూడా లావుగా మారతాయి. దీంతో లోయర్ బాడీ మొత్తం కూడా ఫ్యాట్ పెరిగినట్లుగా మారి లావుగా మారుతుంది. ఈ ప్రాబ్లమ్ తగ్గేందుకు ఎక్సర్‌సైజెస్, ఇతర వర్కౌట్స్ వంటివి చేస్తారు. వీటితో పాటు డైట్ కూడా ముఖ్యమే. అలాంటి డైట్ గురించి ఫిట్‌నెస్‌కోచ్ మంకిరత్ ఎక్స్‌ప్లెయిన్ చేస్తున్నారు. అవేంటో చూద్దాం.



**ప్రోటీన్ తీసుకోవడం**

ప్రోటీన్ తీసుకోవడానికి కొంతమంది ప్రోటీన్ పౌడర్స్‌పై డిపెండ్ అవుతారు. అలా కాకుండా, నేచురల్‌గా ప్రోటీన్‌ని తీసుకోవాలి. దీనికోసం నాన్‌వెజ్‌లో అయితే గుడ్లు, చికెన్, చేపల వంటివాటిని తీసుకోవాలి. నడుము తగ్గకపోతే ఇన్సులిన్ స్థిరంగా ఉండదు. మీరు మీ నడుము సైజ్‌ని తగ్గించుకోవాలనుకుంటే ప్రోటీన్ కచ్చితంగా తీసుకోవాలి. అందుకే, మీ డైట్‌లో గుడ్లు, పనీర్, పెరుగు, పప్పుల్ని తీసుకోవాలి. వీటిలో ఎక్కువగా ప్రోటీన్ ఉంటుంది.

**రోజూ గిన్నె పచ్చికూరగాయలు**

రోజూ బౌల్ వెజిటేబుల్స్ తీసుకోవాలి. దీని వల్ల కడుపు ఉబ్బరం ఉండదు. కొలెస్ట్రాల్ కూడా కరుగుతుంది. కూరగాయల్లో ఎక్కువగా దోసకాయ, క్యారెట్, బీట్‌రూట్, క్యాబేజీ వంటివాటిని తీసుకోవచ్చు. దీని వల్ల నీటి నిలుపుదలని తగ్గించి వాపుని



తగ్గిస్తుంది. ఆకుకూరల వంటివాటిని తీసుకోవచ్చు. వీటిని మనం ప్రోటీన్ కాంబినేషన్‌తో కూడా తినొచ్చు.

**ఉదయమే నానబెట్టిన సీడ్స్**

సీడ్స్ కూడా తీసుకోవడం మంచిది. ఇందులో గుమ్మడిగింజలు, అవిసెలు, చియా సీడ్స్ తీసుకోవాలి. వీటి వల్ల హార్మోన్స్‌కి హెల్ప్ అవుతుంది. ఆకలి తగ్గుతుంది. క్రేవింగ్స్ ఉండవు. హ్యాపీగా వీటిని చక్కగా తీసుకోవచ్చు.

**పండ్లు తినడం**

పండ్లు ఎంతో ఆరోగ్యకరం. కానీ, వీటిని



సరైన టైమ్‌లో సరైన విధంగా తీసుకుంటేనే మంచిది. పండ్లని అలానే తీసుకుంటే బాడీలో ఎక్కువగా షుగర్ పెరుగుతుంది. దీంతో బెల్లీ ఫ్యాట్ పెరుగుతుంది. అలా కాకుండా సీడ్స్, ప్రోటీన్‌తో కలిపి తీసుకోండి. దీంతో చాలా వరకూ మంచి రిజల్ట్ ఉంటుంది.

**డ్రింక్స్ ఏం తాగాలంటే**

పంచదార కలిపిన జ్యూస్‌లు, ఫ్యాన్సీ కాఫీ, హెల్దీ డ్రింక్స్ అంటూ తీసుకుంటారు. కానీ, వీటిలో కలిపిన పంచదార వల్ల నడుములో ఫ్యాట్ పెరుగుతుంది. అందుకే, అవి కాకుండా నీరు తాగండి. దీంతో బాడీ హైడ్రేట్ అవుతుంది. బాడీలో పేరుకుపోయిన ట్యాక్సిన్స్ అన్నీ కూడా బయటికి వెళ్లిపోతాయి.

**డిన్నర్ చేయడం**

అదే విధంగా, రాత్రి డిన్నర్ కూడా సరైన విధంగా తీసుకోవాలి. లేట్‌గా తినొద్దు. దీంతో కార్టిసాల్ పెరిగి బెల్లీ ఫ్యాట్ పెరుగుతుంది. అయితే, రాత్రి డిన్నర్ తర్వాత 10 నుంచి 15 నిమిషాల తర్వాత కొద్దిపాటి వాకింగ్ చేయడం మంచిది.

కొంతమంది నడుము లావుగా ఉందంటే అది జెనెటిక్ అంటారు. కానీ, మనం సరైన విధంగా డైట్ మెంటెయిన్ చేసి లైఫ్‌స్టైల్ ఫాలో అయితే హార్మోన్స్ సరిగ్గా మారితే నడుము సైజ్ తగ్గుతుంది. ఇప్పుడు చెప్పిన డైట్‌ని సరిగ్గా 28 రోజుల పాటు తీసుకుంటే చాలా వరకూ బాడీలోని కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దీంతో నడుము సైజ్ కూడా తగ్గుతుంది.


# జుట్టు రాలడాన్ని తగ్గించి లివర్ బ్లడ్‌కి హెల్ప్ చేసే సూప్




ఆయుర్వేదంలో మనకం ఎన్నో అద్భుత పదార్థాలు ఉంటాయి. వీటిని వాడడం వల్ల చాలా వరకూ మనకి ఉన్న సమస్యల్ని దూరం చేసుకోవచ్చు. అలాంటి వాటిలో జుట్టు సమస్యల్ని దూరం చేయడం కూడా ఒకటి. ప్రజెంట్ చాలా మంది అందంపై ఫోకస్ చేయడంతో జుట్టు అందంగా, ఆరోగ్యంగా కనిపించాలని చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. అలాంటి రిజల్ట్స్ కోసం మనం బయట దొరికే పదార్థాలని కాకుండా కొన్ని ఆయుర్వేద మార్గాలను ఎంచుకోవచ్చు. అలాంటి ఓ టానిక్ గురించి తెలుసుకోండి. నోటిద్వారా తీసుకునే ఈ సూప్‌ని నల్లనువ్వులతో తయారుచేస్తాం. ఇది జుట్టు సమస్యల్నే కాకుండా ఇతర సమస్యల్ని కూడా దూరం చేస్తాయి.









**జుట్టు పెరుగుదలని పెంచే సూప్**

సాధారణంగా ఈ సూప్‌ని ఆయుర్వేద ఎక్స్‌పర్ట్ అనిసెంట్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసుకున్నారు. చైనీస్ వైద్యం నుండి ఇన్‌స్పైర్ అయిన ఈ సూప్‌ని జుట్టు పెరుగుదలకి హెల్ప్ చేసే టానిక్‌గా చూడొచ్చు. దీనిని తీసుకోవడం వల్ల తల, జుట్టు మూలాలకి అవసరమైన ఖనిజాలు అందుతాయి.

**సూప్‌తో కలిగే లాభాలు**

ఇప్పుడు నల్లనువ్వులతో తయారుచేసిన ఈ సూప్ కిడ్నీకి మేలు చేసి లివర్ బ్లడ్‌ని ప్యూరిఫై చేస్తుంది. చైనీస్ వైద్యంలో బలమైన, నల్లని హెల్దీ జుట్టు మీ సొంతమవుతుంది. నేచురల్‌గానే జుట్టుని బలంగా చేయడంలో ఈ టానిక్ హెల్ప్ చేస్తుంది.

**టానిక్ తయారీకి కావాల్సిన పదార్థాలు**

2 టేబుల్ స్పూన్ల నల్లనువ్వులు
2, 3 టేబుల్ స్పూన్ల నీరు
2 కప్పుల ఫిల్టర్ నీరు
1 టేబుల్ స్పూన్ బియ్యం పిండి
1 టీస్పూన్ అన్‌రిఫైండ్ పంచదార

**ఎలా తయారుచేయాలి?**

నల్లనువ్వుల్ని ముందుగా 10 నిమిషాల పాటు తక్కువ మంటపై పొడిగా వేయించాలి. ఎక్కువగా ఫ్రై చేయొద్దు.

ఈ గింజల్ని కొద్దిగా నీరు పోసి పేస్టులా చేయండి.

ఓ పాన్‌లో 2 కప్పుల నీరు నువ్వుల పేస్ట్, బియ్యం పిండి, పంచదార వేయండి.

వీటన్నింటిని బాగా మరిగించండి. 10 నిమిషాల పాటు మరిగాక సిమ్‌లో ఉంచండి.

అంతే పోషకాలతో నిండిన సూప్ తయారి.

**ఎప్పుడు, ఎంత పరిమాణంలో తాగాలి.**

ఈ సూప్‌ని వారానికి రెండు సార్లు తాగాలి. చలికాలంలో తాగితేనే మంచిది.

సాయంత్రం లైట్‌ఫుడ్‌తో కలిపి తీసుకోవాలి. 4 నుంచి 6 వారాల పాటు రెగ్యులర్‌గా తీసుకుంటే మంచి రిజల్ట్స్ కనిపిస్తాయి.

**ఎలా పనిచేస్తుంది?**

సూప్‌లో ఐరన్, జింక్‌లు ఉంటాయి. ఇవి తలపై చర్మ రక్తప్రసరణని మెరుగు పరిచి జుట్టు, కుదుళ్ళ బలాన్ని మెరుగ్గా చేస్తుంది.

కాల్షియం, మెగ్నీషియంలు కెరాటిన్ ఉత్పత్తి, కుదుళ్ళ ఆరోగ్యాన్ని పెంచుతుంది.

ఒమేగా 6 కొవ్వులు, విటమిన్ ఈ పొడి, డ్రై హెయిర్‌ని మృదువుగా చేస్తుంది. సెసామిన్ అనే యాంటీ ఆక్సిడెంట్స్ ఫోలికల్స్‌ని ఒత్తిడి నుండి కాపాడతాయి.

**చైనిస్ వైద్యంలో ఎలా వాడతారు?**

చైనీస్ వైద్యంలో ఈ టానిక్‌ని జుట్టుని కిడ్నీ ఎసెన్స్, లివర్ బ్లడ్ పొడిగింపుగా వాడతారు.

నల్లనువ్వులు జుట్టుకి టానిక్‌లా పనిచేసేందుకు హెల్ప్ చేస్తాయి.

వీటి వల్ల జుట్టు రంగు నెరవడం, రాలడం తగ్గడం, కుదుళ్ళు బలంగా మారడానికి హెల్ప్ చేస్తాయి.

కొంతమందికి జీర్ణ సమస్యలు, డయేరియా, పేగు మంట వంటి సమస్యలు ఉంటాయి. అలాంటివారు వాడొద్దు.

# 'బెయిల్' వస్తోంది




శివరాజ్‌కుమార్, సంజన ఆనంద్, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'బెయిల్'. పవన్ వడయార్ దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్నారు. సంగీత, సాయికుమార్, జయరామ్, గోపాల్ కృష్ణ దేశ్‌పాండే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా అక్టోబరు 2న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. ఈ మేరకు "న్యాయం జరుగుతుంది" అనే క్యాప్షన్‌ను జోడించింది. "బాబీ.. పులికి వేటాడటానికి అదృష్టం అవసరం లేదు. ఎందుకంటే వేటాడటం దాని అభిరుచి కాదు. అదే దాని వృత్తి. మనుషులు కాదు వాళ్లు రాక్షసులు" లాంటి సంభాషణలతో ఆసక్తిగా సాగుతోందీ టీజర్. ఇందులో శివరాజ్‌కుమార్ పోలీసు అధికారి పాత్రలో కనిపించిన తీరు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. న్యాయపోరాటం, ప్రతీకారం, శక్తిమంతమైన అండర్‌వరల్డ్ ఘర్షణల చుట్టూ ఈ కథ తిరుగుతుందని టీజర్ స్పష్టం చేస్తుంది.

# నువ్వు లేకుండా బతకలేను



"కన్నీళ్లతో నీ వైపు కనీసం చూడలేకపోయాను. అయ్యో నువ్వు ఒంటరిగా వెళ్లిపోయావు. నా గుండె ఆగిపోతుంది" అంటూ ఓ తల్లి తన కూతుర్ని కలవాలనే ఆశతో పరితపిస్తోంది. తాప్సి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమే 'గాంధారి'. దేవాశిష్ మఖిజా దర్శకత్వం వహిస్తున్నారు. సెప్టెంబరు 3న నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వేదికగా 'దిల్ జానేయా' అనే పాటను విడుదల చేసింది చిత్రబృందం. "నువ్వు లేకుండా నేను బతకలేను. నీవల్లే నా హృదయం కుదుటపడింది. ఇప్పుడు నీకోసమే బాధతో కుంగిపోతుంది. నువ్వు లేకుండా ఉండటం నావల్ల కాదు, గుండె పగిలిపోతుంది" అంటూ సాగుతున్న గీతం తల్లీకూతుళ్ల మధ్య ఉన్న బంధాన్ని తెలియజేస్తుంది. కౌసర్ మునీర్ సాహిత్యమందించగా దీపాలి సహాయ్, యశ్ కపూర్ ఆలపించారు. ఈ సినిమాలో అంధురాలైన తల్లి పాత్రలో కనిపించనుంది తాప్సి. ఇష్వాక్ సింగ్, ఛాయా కదమ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# 'ప్రళయ్'లో చిక్కుకుపోయా

గతేడాది 'లోక' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించి సూపర్ ఉమెన్ అనిపించుకుంది మలయాళీ భామ కల్యాణి ప్రియదర్శన్. ఈ విజయ ఉత్సాహంలోనే ఆమె 'ప్రళయ్' అనే తన తొలి హిందీ సినిమాతో మరోసారి తెరపై మ్యాజిక్ చేయడానికి సన్నద్ధమవుతోంది. బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. జై మెహతా దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్ర షూటింగ్ ప్రారంభమైనట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రీకరణలో తను కూడా పాల్గొన్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది కల్యాణి. "ఈ ఓనంకి ముంబయిలోని 'ప్రళయ్'లో పూర్తిగా చిక్కుకుపోయాను. అందుకే కుటుంబంతో వేడుకలు లేవు. పండగ విశేషాలు లేవు. వాటికి బదులుగా గత రెండు నెలల నుంచి కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నా"ని అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొంది. జాంబీ థ్రిల్లర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు.




# మునుపెన్నడూ చూడని ఫాంటసీ థ్రిల్లర్



'ఐయామ్ గేమ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు దుల్కర్ సల్మాన్. ఆయన కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని నహాస్ హిదయత్ తెరకెక్కించారు. వే ఫేరర్ ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. కయాదు లోహర్ కథానాయిక. కతిర్, మిస్కిన్, సంయుక్త విశ్వనాథ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ ద్వారా సెప్టెంబరు 3న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రం కోసం దుల్కర్ స్వయంగా ఆలపించిన "లూజర్.." గీతాన్ని విడుదల చేశారు. దీనికి జేక్స్ బిజోయ్ స్వరాలు సమకూర్చగా.. సనారె సాహిత్యమందించారు. బెన్నీ దయాల్ ఆలపించారు. "ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని స్టైలిష్ ఫాంటసీ థ్రిల్లర్ ఇది. భారీ పోరాట ఘట్టాలు, థ్రిల్లింగ్ ఛేజ్ సీక్వెన్స్‌లతో అందర్నీ కట్టిపడేస్తుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి కూర్పు: చమన్ చాకో, ఛాయాగ్రహణం: జిమ్షి ఖలీద్.

# ఆసియా క్రీడలకు నీరజ్ చోప్రా దూరం



ఆసియా క్రీడల ముంగిట భారత బృందానికి షాక్ తగిలింది. జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా గాయపడ్డాడు. శిక్షణ సమయంలో అతడి చీలమండ లిగమెంట్‌కు గాయమైంది. దీంతో సెప్టెంబరులో జరగనున్న ఆసియా క్రీడలకు దూరం కానున్నాడు. ఈ విషయాన్ని నీరజ్ చోప్రా శనివారం సోషల్ మీడియా ద్వారా తెలియజేశాడు.

"ఎంతో కష్టపడిన తర్వాత లుసానె డైమండ్ లీగ్‌లో ఈ సీజన్‌లో అత్యుత్తమ (88.05 మీటర్లు)త్రోను అందుకున్నట్లు అనిపించింది. దురదృష్టవశాత్తు ఆ తర్వాత కొద్ది కాలానికే శిక్షణ సమయంలో నా చీలమండ వద్ద లిగమెంట్ చిట్లిపోయింది. వైద్యుడితోపాటు నా టీమ్‌తో చర్చించిన అనంతరం ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఇది నిరాశ కలిగించే విషయం. నా ఆటలో రిథమ్‌ను అందుకునే దశకు చేరుకున్నానని భావిస్తున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరం. ఇప్పుడు నా దృష్టి పూర్తిగా కోలుకోవడం, మరింత దృఢంగా తిరిగి రావడంపైనే ఉంది" అని నీరజ్ చోప్రా పేర్కొన్నాడు.

ఈ గాయం కారణంగా సెప్టెంబరు 5న బ్రసెల్స్‌లో జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్‌కు కూడా నీరజ్ దూరంకానున్నాడు. సెప్టెంబరు 11 నుంచి 13 వరకు జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ పాల్గొనడం లేదు. ఆసియా క్రీడలు సెప్టెంబరు 19 నుంచి జపాన్‌లో ప్రారంభంకానున్న విషయం తెలిసిందే.

# వైభవ్ సూర్యవంశీ ప్రకటన.. మనసున్నోడివయ్యా అంటూ ప్రశంసలు!

వయసులో చిన్న అయినా .. ఆలోచనలో మిన్న అని నిరూపించుకున్నాడు భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ . భారత్ తరఫున అత్యంత పిన్నవయసులోనే అరంగేట్రం చేసి రికార్డు సృష్టించి.. దూకుడే తన మంత్రమంటూ సత్తా చాటాడు. ఇప్పుడు మరో అడుగు ముందుకేస్తూ అభిమానులను ఆకట్టుకున్నాడు. విద్యార్థులకు సాయం చేసేందుకు ముందుకొచ్చాడు.

నిన్న చెప్పాడు.. నేడు ప్రకటించాడు 'గొప్ప విషయాలు రాబోతున్నాయి.. అలాగే చూస్తూ ఉండండి' అంటూ తన సోషల్ మీడియా ఖాతాలో వైభవ్ సూర్యవంశీ పోస్టు పెట్టాడు. ఏంటా.. అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తుండగా.. ఇవాళ ఉదయం ఓ ప్రకటన చేశాడు. "నాకు ఎక్స్ ప్లాట్‌ఫామ్ నుంచి వచ్చే ఆదాయాన్ని అవసరమైన విద్యార్థుల చదువుకు




వెచ్చించాలని భావిస్తున్నా. అర్హత కలిగిన వారు సంప్రదించగలరు. పాఠశాల, కళాశాలకు సంబంధించి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నవారికి సాయంగా ఉంటా. నాకు తోచినరీతిలో మద్దతు ఇచ్చేందుకు ప్రయత్నిస్తా" అని వైభవ్ పోస్టు పెట్టాడు. దీంతో యువ క్రికెటర్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. చిన్న వయసులోనే ఇంతటి గొప్ప ఆలోచన చేసినందుకు అభినందనలు అంటూ కామెంట్లు చేశారు.

# 51 ఏళ్ల వయసులో 'ఫైఫర్'.. అంతర్జాతీయ మ్యాచ్‌లో అరుదైన రికార్డు

క్రికెట్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన చేయడం కొత్తేమీ కాదు. కానీ, 51 ఏళ్ల వయసులో ఓ క్రికెటర్ ఈ ఫీట్ సాధిస్తే అద్భుతమే కదా.. అదీనూ అంతర్జాతీయ మ్యాచ్‌లో. ఈ ఘనతను 'ఐస్లే ఆఫ్ మ్యాన్' జట్టుకు చెందిన జోన్ హిక్స్ అనే మహిళా క్రికెటర్ సాధించింది. ఆటకు వయసుతో సంబంధం లేదని నిరూపించింది.

రొమానియా వేదికగా మహిళల కాంటినెంటల్ కప్ జరుగుతోంది. అందులో గ్రీస్‌తో ఐస్లే తలపడింది. తొలుత బ్యాటింగ్ చేసిన గ్రీస్ 15 ఓవర్లలో 52 పరుగులకే కుప్పకూలింది. జోన్ హిక్స్ 10 పరుగులను మాత్రమే ఇచ్చి ఐదు వికెట్లు (ఫైఫర్) తీసింది. ఆమె దెబ్బకు గ్రీస్ జట్టులోని ఒక్కరు మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనలో ఐస్లే టీమ్ 6 ఓవర్లలోనే ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 56 పరుగులు చేసి విజయం సాధించింది.

1932 నాటి రికార్డును అధిగమించి..



ఇప్పటి వరకు పురుషుల, మహిళల క్రికెట్‌లో (Cricket History) ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన పెద్ద వయసు బౌలర్ రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన బెర్ట్ ఐరన్‌మోంగర్ పేరిట ఉండేది. 1932లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఆయన ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. అప్పటికి ఆయన వయసు 49 ఏళ్లు. ఇప్పుడు జోన్ హిక్స్ 51 ఏళ్ల వయసులో ఆ రికార్డును బద్దలు కొట్టింది. తన 40వ ఏట మహిళా క్రికెట్‌లోకి అడుగు పెట్టిన హిక్స్ ఆఫ్ స్పిన్నర్‌గా పేరొందింది. ఇప్పటి వరకు 22 అంతర్జాతీయ టీ20ల్లో 33 వికెట్లు పడగొట్టింది.

# ఆ కేసులోని లలిత్ మోదీని నేను కాదు..: ఐపీఎల్ మాజీ ఛైర్మన్



ఓ ఆస్తి వివాదంలో తాను చిక్కుకున్నానని వచ్చిన కథనాలపై ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీతీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అది తాను కాదని.. తనలాంటి పేరు ఉన్న మరో వ్యక్తి అని లలిత్ మోదీ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తప్పును సరిదిద్దుకోవాలని విజ్ఞప్తి చేశారు. అసలేం జరిగిందంటే?

దిల్లీలోని వసంత్ విహార్ ప్రాంతంలో బీడీఆర్ బిల్డర్స్‌తో లలిత్ మోదీకి ఆస్తి వివాదం తలెత్తిందని.. కోర్టు కూడా నోటీసులు జారీ చేసినట్లు పలు ఛానళ్లలో ఆయన ఫొటోలతో వార్తలు వచ్చాయి. ఇది తన దృష్టికి రావడంతో లలిత్ మోదీ వివరణ ఇస్తూ పోస్టు పెట్టారు. "ఇక్కడ మీకు ఓ విషయం చెప్పదల్చుకున్నా. వసంత్ విహార్ / బీడీఆర్ బిల్డర్స్ ప్రాపర్టీ వివాదంలో ఉన్న లలిత్ మోదీని నేను కాదు. పలు మీడియా సంస్థలు తప్పుగా ప్రచురించాయి. కోర్టు ఉత్తర్వుల ప్రకారం.. సదరు లలిత్ మోదీ తండ్రి పేరు జేఆర్ మోదీ. దిల్లీలోని వసంత్ విహార్ పశ్చిమ మార్గ్ 32 ప్రాంతానికి చెందిన నివాసి. నేను లలిత్ మోదీని. ఐపీఎల్ వ్యవస్థాపకుడిని" అని ఆయన పోస్టు పెట్టారు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945